
thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08


## కేప్ వెర్డే పోరాటం.. అర్జెంటీనాకు చెమటలు


11

# చురకలు


Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 97 | జగిత్యాల | ఆదివారం | 05 జూలై, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |




# అప్పుల్లో రాష్ట్రం



## ఫామ్‌హౌస్‌లు, పదవులు వాళ్ల కుటుంబానికే

- 8.50 లక్షల కోట్ల అప్పులు.. పేదలకు కేసీఆర్ చేసిందేమీ లేదు
- దళితుల ప్రాణాలకు విలువ లేదా?
- మళ్లీ ఆ దోపిడీ పాలన కావాలా
- మిడ్జిల్ అభివృద్ధికి భారీగా నిధులు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

వివరాలు 2లో..

జడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రి దాకా 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా మిడ్జిల్‌లో నిర్వహించిన కృతజ్ఞత సభలో సీఎం రేవంత్ రెడ్డి విపక్ష బీఆర్ఎస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రాన్ని 8.50 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని, కేసీఆర్ కుటుంబ సభ్యులు వేల కోట్ల ఆస్తులు, ఫామ్‌హౌస్‌లు ఎలా సంపాదించారో చెప్పాలని ఆయన నిలదీశారు. ఇదే సభలో మిడ్జిల్ అభివృద్ధి కోసం 47.08 కోట్ల రూపాయల పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. గడిచిన 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ సెలవు తీసుకోలేదని, వచ్చిన అవకాశాన్ని ఎన్నడూ దుర్వినియోగం చేయలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కేసీఆర్ ఏ గ్రామంలోనైనా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, 3 ఎకరాల భూమి, కోటి ఎకరాలకు నీరు ఇచ్చారా అని నిలదీశారు. మళ్లీ కేసీఆర్ కుటుంబ దోపిడీలు, దొంగతనాలు మొదలు కావడానికే ప్రజా పాలన పోవాలా అని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

## అరుదైన నాయకుడు రేవంత్!



- సీఎంకు ప్రత్యేక శుభాకాంక్షలు
- కొనియాడిన మంత్రులు, టీపీసీసీ అధ్యక్షులు

2

# టీఆర్ఎస్ పేరు మార్చబోం!

## అవసరమైతే న్యాయపోరాటం

- ఈసీకి కల్వకుంట్ల కవిత స్పష్టీకరణ
- పార్టీ పేరు మార్చుకోవాలని నోటీసులు
- లేదంటే దరఖాస్తును మూసివేస్తామని హెచ్చరిక

3





## కష్టపడి పైకి వచ్చిన కేసీఆర్, రేవంత్

- సీఎం రేవంత్‌కు బండి సంజయ్ అభినందనలు
- ఓట్లపై భారీ కుట్ర!.. మజ్లిస్‌తో కాంగ్రెస్ ప్రభుత్వం కుమ్మక్కు
- హిందువులే మైనార్టీలయ్యే తీవ్ర ప్రమాదం

2

# గోబెల్స్ ప్రచారాలే!

- రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారవు
- కాంగ్రెస్ అప్పులు మా ఖాతాలో వేస్తారా
- అప్పులపై డిప్యూటీ సీఎం తప్పుడు లెక్కలు
- బీఆర్ఎస్ అప్పు 4.14 లక్షల కోట్లే
- 5.16 లక్షల కోట్ల అప్పు అవాస్తవం
- భట్టి విక్రమార్కపై హరీశ్ రావు ఫైర్



రాష్ట్ర అప్పులపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెబుతున్న లెక్కలన్నీ పచ్చి అబద్ధాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు కేవలం 4.14 లక్షల కోట్లు మాత్రమేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు కుండబద్దలు కొట్టారు. కాంగ్రెస్ తెచ్చిన 15 వేల కోట్ల అప్పును కూడా తమ ఖాతాలో వేసి తప్పుడు లెక్కలతో గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు కోపంతో రంకెలు వేసినంత మాత్రాన వాస్తవ అంకెలు ఎన్నటికీ మారవని ఆయన ఘాటుగా విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు 5.16 లక్షల కోట్లు అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పిన మాటలు పూర్తిగా అవాస్తవమని మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వివరాలు 2లో..



## కుళ్లిపోయిన మాంసం, కల్తీ పేస్టులు

- 00 రోజుల్లో 185 కేసులు
- భారీగా కల్తీ పదార్థాల సీజ్
- హోటళ్లపై హెచ్ ఫాస్ట్ దాడులు
- ఫిర్యాదులకు సీపీ సజ్జనార్ పిలుపు

3

## నిర్లక్ష్యం చేస్తే వేటే!

- తక్కువ వర్షపాతంపై అప్రమత్తంగా ఉండాలి
- ప్రత్యామ్నాయ పంటలపై వెంటనే దృష్టిపెట్టాలి
- సీఎస్ సంజయ్ జాజు



వివరాలు 3లో..



## పనుల్లో వేగం పెంచండి

- ఓఆర్ఆర్ పరిధిలో పేదలకు ఇళ్ల నిర్మాణాలు
- నియోజకవర్గానికి 500 ఇళ్లు కేటాయింపు
- మంత్రి పొంగులేటి

2

## నీలోఫర్‌లో దారుణ ఘటన!

- 6 రోజుల శిశువును ఆస్పత్రిలో చేర్చి పరారైన దంపతులు
- కేసు నమోదు చేసిన నాంపల్లి పోలీసులు

3





## భద్రకాళి వద్ద ఉద్రిక్తత!

3

## పార్లమెంట్ షెడ్యూల్ ఖరారు



- జూలై20 నుంచి ఆగస్ట్ 13 వరకు సమావేశాలు
- ఎక్స్ వేదికగా వెల్లడించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు

4



## బద్రీనాథ్ ఆలయంలో ఆర్థిక అవకతవకలు

అంతర్గత విచారణకు ఆదేశించిన ఆలయ కమిటీ

4

## ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

- ఇంధనంపై ప్రజలను భయపెట్టే యత్నాలు జరిగాయి
- అయితే సమర్థంగా సవాళ్లను అధిగమించగలిగాం
- రాజస్థాన్‌లో గ్రీన్ రిఫైనరీని ప్రారంభించిన ప్రధాని మోడీ

పశ్చిమాసియా సంక్షోభం వేళ దేశంలో ఇంధన సంక్షోభాన్ని విజయవంతం ఎదుర్కొన్నట్లు ప్రధాని మోడీ అన్నారు.



4

చురకలు

ఆదివారం 05 జూలై 2026

# కష్టపడి పైకి వచ్చిన కేసీఆర్, రేవంత్

**సీఎం రేవంత్‌కు బండి సంజయ్ అభినందనలు**

**ఓట్లపై భారీ కుట్ర!.. మజ్లిస్‌తో కాంగ్రెస్ ప్రభుత్వం కుమ్మక్కు**

**హిందువులే మైనార్టీలయ్యే తీవ్ర ప్రమాదం**



**హైదరాబాద్:** ప్రజా జీవితంలో 2 దశాబ్దాలు పూర్తి చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ కష్టపడి పైకొచ్చిన వారేనని ఆయన ప్రశంసించారు. అయితే రాష్ట్రంలో ఎస్ఐఆర్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్‌తో కుమ్మక్కై హిందువుల ఓట్లను ఏరివేసే భారీ కుట్ర చేస్తోందని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా జీవితంలో 2 దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ శనివారం మీడియాతో మాట్లాడుతూ ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ఇద్దరూ కూడా ఎంతో కష్టపడి పైకి వచ్చినవారే అని ఆయన కొనియాడారు. ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**మజ్లిస్‌తో కుమ్మక్కై..**

రాష్ట్రంలో ఎస్ఐఆర్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం భారీ కుట్ర చేస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. మజ్లిస్ పార్టీతో కుమ్మక్కై ఉద్దేశపూర్వకంగా హిందువుల ఓట్లను జాబితా నుంచి తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆయన మండిపడ్డారు. ఇదే జరిగితే తెలంగాణలో త్వరలోనే హిందువులే మైనార్టీలుగా మారే తీవ్ర ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో క్షేత్రస్థాయి అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం సహకరించడం లేదని కేంద్ర మంత్రి విమర్శించారు.

# పనుల్లో వేగం పెంచండి!

**అధికారులకు మంత్రి పొంగులేటి దిశానిర్దేశం**

**ఓఆర్ఆర్ పరిధిలో పేదలకు ఇళ్ల నిర్మాణాలు**

**నియోజకవర్గానికి 500 ఇళ్లు కేటాయింపు**

**త్వరలో ఖరారు కానున్న టెండర్లు**

**రెవెన్యూ శాఖకు అత్యాధునిక శాశ్వత భవనాలు**



**హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో వేగం పెంచాలని, ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. ఓఆర్ఆర్ పరిధిలో పేదల ఇళ్ల నిర్మాణాలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఒకే మోడల్‌లో శాశ్వత భవనాల నిర్మాణంపై ఆయన దిశానిర్దేశం చేశారు. ఓఆర్ఆర్ పరిధిలో పేదల ఇళ్ల నిర్మాణాలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శనివారం సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల సొంతింటి కలను నెరవేర్చే సంకల్పంతో గ్రామాల్లో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతం అయిందన్నారు. ఇదే స్ఫూర్తిని ఓఆర్ఆర్ పరిధిలో చేపట్టబోయే పట్టణ పేదల గృహ నిర్మాణాల్లోనూ చూపించాలన్నారు. ఓఆర్ఆర్ పరిధిలో పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని, వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ మేరకు రెవెన్యూ, గృహ నిర్మాణ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఖరారైన స్థలాల్లో వెంటనే పనులు మొదలుపెట్టాలని, స్థలాలు గుర్తించని నియోజకవర్గాల్లో వెంటనే ఆ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఓఆర్ఆర్ పరిధిలోని 26 నియోజకవర్గాలకు గాను ఒక్కో నియోజకవర్గంలో తొలి విడతలో 500 ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. వీటికి సంబంధించిన టెండర్లను త్వరలోనే ఖరారు చేస్తామని తెలిపారు.

**ఒకే మోడల్‌లో రిజిస్ట్రార్ కార్యాలయాలు..**

రాష్ట్ర వ్యాప్తంగా 10 ఆర్డీఓ, 107 తహసీల్దార్, 2 డీఐజీ, 4 జిల్లా సబ్ రిజిస్ట్రార్, 52 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ భవనాలన్నీ ఒకే డిజైన్, నమూనాలో అత్యాధునిక సదుపాయాలతో ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా నిర్మిస్తున్నామన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఆదా, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో సోలార్, పార్కింగ్ సదుపాయాలు కల్పిస్తామని ఆయన వివరించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ కార్యదర్శి వీపీ గౌతమ్, ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# అప్పుల్లో రాష్ట్రం

- ఫామ్‌హౌస్‌లు, పదవులు వాళ్ల కుటుంబానికే
- 8.50 లక్షల కోట్ల అప్పులు.. పేదలకు కేసీఆర్ చేసిందేమీ లేదు
- దళితుల ప్రాణాలకు విలువ లేదా?
- మళ్లీ ఆ దోపిడీ పాలన కావాలా
- మిడ్జిల్ అభివృద్ధికి భారీగా నిధులు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**మహబూబ్‌నగర్:** జడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రి దాకా 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా మిడ్జిల్‌లో నిర్వహించిన కృతజ్ఞత సభలో సీఎం రేవంత్ రెడ్డి విపక్ష బీఆర్ఎస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రాన్ని 8.50 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని, కేసీఆర్ కుటుంబ సభ్యులు వేల కోట్ల ఆస్తులు, ఫామ్‌హౌస్‌లు ఎలా సంపాదించారో చెప్పాలని ఆయన నిలదీశారు. ఇదే సభలో మిడ్జిల్ అభివృద్ధి కోసం 47.08 కోట్ల రూపాయల పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. గడిచిన 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ సెలవు తీసుకోలేదని, వచ్చిన అవకాశాన్ని ఎన్నడూ దుర్వినియోగం చేయలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. జడ్పీటీసీగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌లో నిర్వహించిన కృతజ్ఞత సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పాలకుల దోపిడీపై సీఎం తీవ్ర విమర్శలు చేశారు. 70 వేల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రాన్ని 8.50 లక్షల కోట్ల అప్పుల స్థాయికి దిగజార్చారని మండిపడ్డారు. దళితులను లారీలతో తొక్కించి చంపారని, పదేళ్లు కేవలం కేసీఆర్ కుటుంబానికి, బంధువులకు తప్ప ఎవరికైనా ఉద్యోగాలు వచ్చాయా అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్‌కు గజ్వేల్‌లో 1000 ఎకరాల ఫామ్‌హౌస్ ఎలా వచ్చిందని, కేటీఆర్, కవిత, హరీశ్ రావులకు వేల కోట్ల విలువైన భూములు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కేసీఆర్ ఏ గ్రామంలోనైనా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, 3 ఎకరాల భూమి, కోటి ఎకరాలకు నీరు ఇచ్చారా అని నిలదీశారు. మళ్లీ కేసీఆర్ కుటుంబ దోపిడీలు, దొంగతనాలు మొదలు కావడానికే ప్రజా పాలన పోవాలా అని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

**47.08 కోట్లతో అభివృద్ధి పనులు..**

వెనుకబడిన మిడ్జిల్‌ను దత్తత తీసుకుని అన్ని విధాలా అభివృద్ధి చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఇక్కడి ప్రజలు ఆనాడు నాటిన మొక్క ఇవాళ మహా వృక్షమై తనకు సర్వం ఇచ్చారని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులతో కలిసి 47.08 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇందులో 10 కోట్లతో ఉరుకొండపేట శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి, 20 కోట్లతో పాత మిడ్జిల్ మండలంలోని 40 గ్రామ పంచాయతీల (మిడ్జిల్‌లో 24, ఉరుకొండలో 16) అభివృద్ధి పనులు ఉన్నాయి. అలాగే 17.08 కోట్లతో భైరాంపల్లి దగ్గర దుంధుబి వాగు, వడియాల్ సమీపంలోని చిన్న వాగు, వస్పుల కత్వా పునరుద్ధరణ వంటి చెక్ డ్యామ్‌ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు.

**విగ్రహాల ఆవిష్కరణ.. ఆత్మీయ సమ్మేళనం..**

మిడ్జిల్ మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, స్థానిక సీనియర్ నాయకుడు ద్యాప గోపాల్ రెడ్డి విగ్రహాలను సీఎం ఆవిష్కరించారు. 40 ఏళ్లుగా నానుతున్న ఎస్సీ ఉప కులాల వర్గీకరణను పరిష్కరించామని, 100 ఏళ్లుగా జరగని బీసీ కులగణనను తమ ప్రభుత్వమే చేపట్టిందని ఆయన గుర్తుచేశారు. ఈ జిల్లా బిడ్డ బూర్గుల రామకృష్ణారావు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పని చేశారని, జైపాల్ రెడ్డి, మహేంద్రనాథ్ లాంటి గొప్ప నాయకులున్న ప్రాంతం ఇదని కొనియాడారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆయన ఆకాంక్షించారు. అంతకుముందు ఉరుకొండపేటలోని ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 2006 నాటి పాత మిత్రులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో కలిసి ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, డాక్టర్ మల్లు రవి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అరుదైన నాయకుడు రేవంత్!

- సీఎంకు మంత్రుల ప్రత్యేక శుభాకాంక్షలు
- అంచెలంచెలుగా ఎదిగిన ప్రజా నాయకుడు
- లక్ష్యం కోసమే ఆయన పోరాటం
- దీక్షకు నిదర్శనం ఈ ప్రస్థానం
- కొనియాడిన మంత్రులు, టీపీసీసీ అధ్యక్షులు



**హైదరాబాద్:** మిడ్జిల్ జడ్పీటీసీ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగి 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానం పూర్తి చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. ప్రజా జీవితంలో నిస్వార్థంగా సేవలందిస్తున్న ఆయనకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. జడ్పీటీసీ స్థాయి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వరకు 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డిని పలువురు మంత్రులు స్వయంగా కలిసి అభినందనలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి తదితరులు సీఎంకు శుభాకాంక్షలు తెలియజేశారు.

**ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా..**

పాలమూరు జిల్లా నుంచి జడ్పీటీసీగా గెలిచి నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగిన రేవంత్ రెడ్డి లాంటి నాయకులు చాలా అరుదుగా ఉంటారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కొనియాడారు. ఆనాడు తనను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపేందుకు సీఎం స్వయంగా వారి ముందుకు వెళ్లారని గుర్తుచేశారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా తట్టుకుని తాను నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడే గొప్ప నాయకుడు రేవంత్ రెడ్డి అని ఆయన ప్రశంసించారు. జడ్పీటీసీ స్థాయి నుంచి సీఎం వరకు విజయవంతంగా ప్రయాణించిన ఆయన.. ప్రజాసేవలో మరెన్నో విజయాలు సాధించాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు.

**గొప్ప సంకల్పానికి నిదర్శనం..**

2006 లో స్వతంత్ర జడ్పీటీసీగా గెలిచి అంచెలంచెలుగా ఎదిగిన సీఎం ప్రస్థానం ఆయన అంకితభావం, నిబద్ధతకు నిదర్శనమని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. గొప్ప సంకల్పం ఉంటే ఏదైనా సాధించొచ్చు అనడానికి సీఎం జీవితమే ఉదాహరణ అని ఆయన చెప్పారు. 2 దశాబ్దాలుగా నిస్వార్థంగా ప్రజాసేవ చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి మనందరం అండగా ఉండాలని మంత్రి వాకిటి శ్రీహరి కోరారు. తెలంగాణకు పట్టిన చీడను విడిపించి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ఆయనకు తోడుగా నిలవాల్సిన అవసరం ఉందని శ్రీహరి స్పష్టం చేశారు.

# నిర్లక్ష్యం చేస్తే వేటే!

- తక్కువ వర్షపాతంపై అప్రమత్తంగా ఉండాలి
- ప్రత్యామ్నాయ పంటలపై వెంటనే దృష్టిపెట్టాలి
- ఆహార భద్రతలో రాజీ పడొద్దు
- కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు
- సీఎస్ సంజయ్ జాజు



**హైదరాబాద్:** రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదైన జిల్లాల్లో ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు ఆదేశించారు. శనివారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో పాటు ఉన్నతాధికారులతో వివిధ శాఖల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణ, ఆహార భద్రత కట్టుదిట్టమైన అమలుపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో అధికారులతో మరో కీలక సమీక్ష జరిపారు. తక్కువ వర్షపాతం నమోదైన జిల్లాల అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండి, క్షేత్రస్థాయిలో పర్యటించాలని సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను తక్షణమే సిద్ధం చేయాలని సూచించారు. దీనివల్ల రైతులకు పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. శనివారం వ్యవసాయం, ఆరోగ్యం, సురక్షిత తాగునీరు, విద్యా శాఖల పురోగతిపై ఆయన సమీక్షించారు. రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా జరిగేలా గట్టి నిఘా ఉంచాలని, ప్రత్యామ్నాయ పంటలపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కాలానుగుణ వ్యాధుల నివారణకు వివిధ శాఖల మధ్య సమన్వయం తప్పనిసరని స్పష్టం చేశారు. పారిశుధ్యం, దోమల నియంత్రణపై ప్రత్యేక చర్యలు చేపడుతూనే విద్యుత్ సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా కొరత లేకుండా సురక్షిత తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంటశాలలకు అనువైన స్థలాలను గుర్తించి మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయాలని సీఎస్ ఆదేశించారు.

**ఆహార భద్రతపై కఠిన చర్యలు..**

రాష్ట్రంలో ఆహార భద్రతా నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని, కల్తీ ఆహార పదార్థాలపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం తనిఖీలు చేపట్టాలని సీఎస్ సంజయ్ జాజు పేర్కొన్నారు. డ్రగ్ కంట్రోలర్, ఫుడ్ సేఫ్టీ విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ 2 విభాగాలను ఏకతాటిపై నడిపేందుకు తగిన ప్రతిపాదనలను 1 వారం రోజుల్లోగా సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాన్ని అధ్యయనం చేసి మన రాష్ట్రంలో కూడా తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ సమీక్షలో సీఎం సలహాదారు, ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎం ముఖ్య కార్యదర్శులు శేషాద్రి, ఎన్ శ్రీధర్, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, అదనపు డీజీ (ఇంటెలిజెన్స్) విజయ్ కుమార్, వైద్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, వైద్య శాఖ కమిషనర్ సంగీత, డ్రగ్ కంట్రోలర్ డీజీ అవినాష్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

# టీఆర్ఎస్ పేరు మార్చబోం!

- అవసరమైతే న్యాయపోరాటానికి సిద్ధం
- ఈసీకి కల్వకుంట్ల కవిత స్పష్టీకరణ
- పార్టీ పేరు మార్చుకోవాలని నోటీసులు
- లేదంటే దరఖాస్తును మూసివేస్తామని హెచ్చరిక
- ఇప్పటికే ఈసీకి న్యాయపరమైన సమాధానాలు

**హైదరాబాద్:** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ పేరు మార్చుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఇచ్చిన నోటీసులపై ఆ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఘాటుగా స్పందించారు. పార్టీ పేరు మార్చుకునే ప్రసక్తే లేదని, ప్రత్యామ్నాయ పేర్లు ఇచ్చేది లేదని ఆమె తేల్చిచెప్పారు. టీఆర్ఎస్ పేరుకే తాము కట్టుబడి ఉన్నామని, ఒకవేళ ఈసీ తమ వివరణను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తే.. సుప్రీంకోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామని కవిత కుండబద్దలు కొట్టారు. కల్వకుంట్ల కవిత స్థాపించిన 'తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)' పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం షాక్ ఇచ్చింది. కొత్త పార్టీ పేరును మార్చాలంటూ ఈసీ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ రక్షణ సేన పేరుపై ప్రజల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయని ఈసీ పేర్కొంది. 15 రోజుల్లో 3 ప్రత్యామ్నాయ పేర్లు సమర్పించాలని ఆదేశించింది. లేని పక్షంలో దరఖాస్తును మూసివేస్తామని హెచ్చరించింది. టీఆర్ఎస్ పేరును కొనసాగించేందుకు వీలులేదంటూ కవితకు ఈసీ లేఖ రాసింది. పేరు వివాదంతో కవిత కొత్త పార్టీ రిజిస్ట్రేషన్‌కు తీవ్ర అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో కొత్త పేర్లతో దరఖాస్తును సవరించాలని ఈసీ సూచించింది.



## పేరు మార్చే ప్రసక్తే లేదు..

ఈసీ లేఖపై కవిత స్పందించారు. తమకు అధికారికంగా ఈసీ నుంచి వచ్చిన 2 అభ్యంతరాలకు న్యాయపరమైన సమాధానం ఇచ్చామని తెలిపారు. అయితే కొత్త పేర్లు ఇచ్చేది లేదని.. న్యాయపోరాటానికి సిద్ధమని కవిత స్పష్టం చేశారు. తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సంచలనంగా మారిన కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీ 'తెలంగాణ రక్షణ సేన' సంక్షిప్త నామంపై ఈసీ పంపిన లేఖ రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం లేఖ తమకు అందిందని, వారు లేవనెత్తిన 2 ప్రధాన అభ్యంతరాలకు తాము ఇప్పటికే పూర్తిస్థాయిలో చట్టపరమైన సమాధానాలు ఇచ్చామని ఆమె స్పష్టం చేశారు. తమ పార్టీ సంక్షిప్త నామం ఎప్పటికీ 'టీఆర్ఎస్' మాత్రమేనని ఆమె తేల్చి చెప్పారు.

## సుప్రీంకోర్టుకు వెళతాం..

కేంద్ర ఎన్నికల సంఘం సూచించినట్లుగా తాము కొత్త పేర్లు గానీ, ప్రత్యామ్నాయ సంక్షిప్త నామాలు గానీ ఇచ్చే ప్రసక్తే లేదని కవిత మీడియా ముఖంగా కుండబద్దలు కొట్టారు. ప్రజా క్షేత్రంలో ఇప్పటికే 'టీఆర్ఎస్' పేరుతో తాము దూసుకుపోతున్నామని, ఈ తరుణంలో వెనక్కితగ్గే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఒకవేళ ఈసీ తమ వివరణను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తే, దీనిపై అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయపోరాటం చేయడానికి కూడా తాము సిద్ధంగా ఉన్నామని ఆమె స్పష్టం చేశారు. భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నుంచి బయటకు వచ్చిన తర్వాత కవిత అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కొత్త పార్టీని స్థాపించి, తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ రాజేసేలా 'టీఆర్ఎస్' అనే సంక్షిప్త నామాన్ని ఎంచుకున్నారు. గతంలో తన తండ్రి కేసీఆర్ నాయకత్వంలో కొనసాగిన పాత పేరును గుర్తుచేసేలా ఉండటంతో ఈ పేరు ప్రజల్లోకి వేగంగా దూసుకెళ్లింది. అయితే సాంకేతిక, న్యాయపరమైన అభ్యంతరాల నేపథ్యంలో ఈసీ నుంచి 15 రోజుల గడువుతో నోటీసులు రావడం, దానికి కవిత ధీటుగా బదులివ్వడం తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పరిణామం కవిత రాజకీయ ప్రస్థానానికి ఒక సవాల్‌గా మారినప్పటికీ, ఆమె దీనిని చట్టపరంగా ఎదుర్కొనేందుకు వ్యూహాలు రచిస్తున్నారు.

# గోబెల్స్ ప్రచారాలే!

- రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారవు
- కాంగ్రెస్ అప్పులు మా ఖాతాలో వేస్తారా
- అప్పులపై డిప్యూటీ సీఎం తప్పుడు లెక్కలు
- భట్టి విక్రమార్కపై హరీశ్ రావు ఫైర్

**హైదరాబాద్:** రాష్ట్ర అప్పులపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెబుతున్న లెక్కలన్నీ పచ్చి అబద్ధాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు కేవలం 4.14 లక్షల కోట్లు మాత్రమేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు కుండబద్దలు కొట్టారు. కాంగ్రెస్ తెచ్చిన 15 వేల కోట్ల అప్పును కూడా తమ ఖాతాలో వేసి తప్పుడు లెక్కలతో గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు కోపంతో రంకెలు వేసినంత మాత్రాన వాస్తవ అంకెలు ఎన్నటికీ మారవని ఆయన ఘాటుగా విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు 5.16 లక్షల కోట్లు అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పిన మాటలు పూర్తిగా అవాస్తవమని మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ నేతల అనుభవం స్కామ్‌లు చేసేందుకే ఉపయోగపడుతోందని విమర్శించారు. బీఆర్ఎస్ దిగిపోయేనాటికి చెల్లించాల్సిన మొత్తం అప్పు 4.14 లక్షల కోట్లు మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. కళ్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి ఎన్నో అద్భుతమైన సంక్షేమ పథకాలను కేసీఆర్ అమలు చేశారని, నిధులు లేవని ఏనాడూ సంక్షేమ పథకాలను ఆపలేదని ఆయన గుర్తుచేశారు.



## కొత్త డ్రామాలకు తెర..

రాష్ట్రంలో లేని అప్పులను ఉన్నట్టుగా చూపిస్తూ కాంగ్రెస్ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. ప్రభుత్వం ప్రస్తుతం ఎదుర్కొంటున్న వైఫల్యాల నుంచి, తమపై జరుగుతున్న డ్యామేజ్ నుంచి తప్పించుకునేందుకే భట్టి విక్రమార్క ఇప్పుడు కొత్త డ్రామాలకు తెరలేపారని ఎద్దేవా చేశారు. అందులో భాగమే ఇప్పుడు డిప్యూటీ సీఎం తప్పుడు లెక్కలు చెబుతున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు ప్రజలను ఆకట్టుకోవడానికి కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయలేక చేతులెత్తేస్తూ ఇలాంటి కుంటిసాకులు వెతుకుతున్నారని దుయ్యబట్టారు.

## కాలయాపన చేస్తున్నారు..

ప్రజలను నమ్మించి ఓట్లు రాబట్టుకునేందుకే ఆనాడు గ్యారంటీ కార్డులు పంచారని, తీరా ఇప్పుడు వాటిని అమలు చేయాల్సి వచ్చేసరికి రోజుకో మాట, పూటకో సాకు చెబుతూ కాలయాపన చేస్తున్నారని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో చేస్తామని ఆనాడు బాండ్లు రాసిచ్చిన నేతలు ఇప్పుడు మాట మారుస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు కోపంతో ఊగిపోయినంత మాత్రాన వాస్తవాలు మారవని, ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ విధమైన రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు.

# కుళ్లిపోయిన మాంసం, కల్తీ పేస్టులు

00 రోజుల్లో 185 కేసులు — భారీగా కల్తీ పదార్థాల సీజ్

హోటళ్లపై హెచ్ ఫాస్ట్ దాడులు — ఫిర్యాదులకు సీపీ సజ్జనార్ పిలుపు



**హైదరాబాద్:** నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో కల్తీ రాయుళ్లపై హెచ్ ఫాస్ట్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత 100 రోజుల్లో ఏకంగా 185 కేసులు నమోదు చేసి కుళ్లిపోయిన మాంసం, కల్తీ పదార్థాలను భారీగా సీజ్ చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని సీపీ వీసీ సజ్జనార్ కఠినంగా హెచ్చరించారు. ఆహార కల్తీపై హెచ్ ఫాస్ట్ ఉక్కుపాదం మోపింది. నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో దాడులు చేసిన అధికారులు భారీగా కేసులు నమోదు చేశారు. మార్చి 19 న ప్రారంభమైన దాడులకు 100 రోజులు పూర్తి అయ్యాయి. ఈ 100 రోజుల్లో దాదాపు 185 కేసులను నమోదు చేశారు. దాడుల్లో 121.87 టన్నుల కల్తీ, నాణ్యతలేని ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. రాజేంద్రనగర్ జోన్‌లో అత్యధికంగా 55 కేసులు, గోల్కొండలో 44 కేసులు నమోదు అయ్యాయి. దాదాపు 27 టన్నులకు పైగా నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్టును స్వాధీనం చేసుకున్నారు. రసాయనాలతో మగ్గబెట్టిన 25.8 టన్నుల పండ్లను సీజ్ చేశారు. 60 టన్నులకు పైగా చికెన్ వ్యర్థాలు, 15 టన్నుల నాణ్యతలేని చికెన్, మాంసాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

## పీడీ యాక్ట్ నమోదు చేస్తాం..

అధికారుల దాడుల్లో కల్తీ కోవా, పన్నీర్, పెరుగు, నెయ్యి, క్రీమ్, టీ పొడి భారీగా పట్టుబడింది. ఆరోగ్యానికి హానికరమైన 247 కేసులను జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగానికి బదిలీ చేశారు. ప్రజల ఫిర్యాదుల ఆధారంగా 90 కేసులు నమోదు అవ్వగా, పన్నీర్ అవుట్‌లెట్లపై 70 కేసులు నమోదు అయ్యాయి. నాణ్యమైన ఆహారం విషయంలో హోటళ్లు, బేకరీలకు అధికారులు కఠిన మార్గదర్శకాలు జారీ చేశారు. లైసెన్స్ విధానం, వాడిన నూనె పునర్వినియోగంపై ఆంక్షలు విధించారు. కల్తీ మాఫియాపై అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరిక జారీ చేశారు. ప్రతి రోజు సగటున 15 కల్తీ ఫిర్యాదులు అందుతున్నట్లు వెల్లడించారు. కల్తీ సమాచారం ఉంటే డయల్ 100 లేదా వాట్సాప్ నంబర్ 8712661212 కు సమాచారం ఇవ్వాలని సీపీ విజ్ఞప్తి చేశారు.

# సాహితి హాస్పిటల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం

న్యూరో, ఆర్థో, డయాబెటిక్ రోగులకు ఉచిత పరీక్షలు

శస్త్రచికిత్సలు, ల్యాబ్ టెస్టులపై భారీ తగ్గింపులు

సద్వినియోగం చేసుకోవాలన్న సాహితి హాస్పిటల్ నిర్వాహకులు




**సంగారెడ్డి, జూలై 05 (జనం పవర్):** సంగారెడ్డి పట్టణంలోని సాహితి హాస్పిటల్‌లో ఉచిత న్యూరో, ఆర్థో, డయాబెటిక్ మెగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నారు. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ ఉచిత శిబిరంతో పాటు ఉచిత రక్తదాన శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో నరాలు, మెదడు, ఎముకలు, కీళ్లు, మధుమేహం తదితర వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేసి వైద్యుల సలహాలు అందిస్తారు. పక్షవాతం, ముఖం వంకర కావడం, వెన్నుపూస, మెడ, నడుము నొప్పులు, ఫిట్స్, తలనొప్పి, మైగ్రేన్ సమస్యలకు చికిత్స చేస్తారు. అలాగే కాళ్లు చేతులు తిమ్మిర్లు, నరాల బలహీనత, నిద్ర సమస్యలు, కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులు, సయాటికా, యాక్సిడెంట్ కేసులకు నిపుణులు వైద్యం అందిస్తారు.

## శస్త్రచికిత్సలు, ల్యాబ్ పరీక్షలపై రాయితీలు

శిబిరంలో అన్ని రకాల ఆర్థోపెడిక్ సర్జరీలపై 20 శాతం ప్రత్యేక తగ్గింపు ఇవ్వనున్నారు. పీఎల్‌బీఎస్ పరీక్ష పూర్తిగా ఉచితంగా చేస్తారు. ఏ ల్యాబ్ పరీక్షపైనైనా 50 శాతం, మందులపై 15 శాతం తగ్గింపు ఉంటుంది. ప్రత్యేక ఆఫర్ల కింద ఎన్‌సీఎస్ పరీక్షను 2500 రూపాయల స్థానంలో 599 రూపాయలకే, ఈఈజీ పరీక్షను 3500 రూపాయల స్థానంలో 999 రూపాయలకే, హెచ్‌బీఏ1సీ పరీక్షను 600 రూపాయల స్థానంలో 500 రూపాయలకే నిర్ధారించనున్నారు. ప్రముఖ ఆర్థోపెడిక్, ట్రామా సర్జన్ డాక్టర్ అబ్దుల్ రావూఫ్ ఎంబీబీఎస్, ఎంఎస్ (ఆర్థో) రోగులకు వైద్య సేవలు అందిస్తారు. ఈ శిబిరం ఉదయం 10:00 గంటల నుండి రాత్రి 9:00 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. అదేవిధంగా ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు ఉచిత రక్తదాన శిబిరం జరుగుతుంది. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

# నీలోఫర్‌లో దారుణ ఘటన!

6 రోజుల శిశువును ఆస్పత్రిలో చేర్చి పరారైన దంపతులు

కేసు నమోదు చేసిన నాంపల్లి పోలీసులు..

శిశు విహార్‌కు బాబు తరలింపు



**హైదరాబాద్:** కన్న పేగు కఠినమైంది. అనారోగ్యంతో బాధపడుతున్న 6 రోజుల పసికందును తల్లిదండ్రులు నిర్దయగా ఆస్పత్రిలో వదిలేసి వెళ్లిన దారుణ ఘటన నగరంలోని నాంపల్లి నీలోఫర్ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. శ్వాసకోశ సమస్యతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆ మగ శిశువును వైద్యులు ఎంతో బాధ్యతగా వ్యవహరించి కాపాడారు. ఒడిశాకు చెందిన దంపతులు తమ 6 రోజుల మగ శిశువును అనారోగ్య కారణాలతో ఏప్రిల్ 25 న నాంపల్లిలోని నీలోఫర్ ఆస్పత్రిలో చేర్చారు. శిశువు తీవ్రమైన శ్వాసకోశ సమస్యతో బాధపడుతున్నాడు. అయితే ఆస్పత్రిలో చేర్చిన కొద్దిసేపటికే ఆ తల్లిదండ్రులు ఎవరికీ చెప్పకుండా అక్కడి నుంచి అదృశ్యమయ్యారు. పసికందుకు సంబంధించిన వారు ఎవరూ లేకపోవడాన్ని గమనించిన ఆస్పత్రి సిబ్బంది వెంటనే నాంపల్లి పోలీసులకు సమాచారం అందించారు.

## ప్రాణాలు కాపాడిన వైద్యులు..

తల్లిదండ్రులు నిర్దయగా వదిలేసి వెళ్లినప్పటికీ, నీలోఫర్ ఆస్పత్రి వైద్యులు ఆ పసికందును ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. బాబును వెంటనే ఎన్‌బీసీయూ వార్డులో ఉంచి మెరుగైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. ఆసుపత్రి ఆర్ఎంవో ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం పూర్తిగా కోలుకున్న పసికందును మెరుగైన సంరక్షణ కోసం శిశు విహార్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. బాబును వదిలేసి పరారీలో ఉన్న ఒడిశా దంపతులను త్వరలోనే పట్టుకుంటామని స్పష్టం చేశారు.

# భద్రకాళి వద్ద ఉద్రిక్తత!

గుడిని అపవిత్రం చేశారని ఆరోపణలు.. సంప్రోక్షణకు యత్నించిన బీజేపీ నేతలు

అడ్డుకుని అరెస్ట్ చేసిన పోలీసులు.. నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం

కుడా భూముల వ్యవహారమే కారణం

**వరంగల్:** వరంగల్ భద్రకాళి ఆలయం వద్ద వరుసగా 2 వ రోజు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కుడా భూముల వేలంలో అవినీతి జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు గుడిలో పూజలు చేసి ఆలయాన్ని అపవిత్రం చేశారని ఆరోపిస్తూ.. శనివారం సంప్రోక్షణకు యత్నించిన బీజేపీ నేతలను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు. కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) భూముల వేలం వ్యవహారం వరంగల్ నగరంలో రాజకీయ రగడ సృష్టిస్తోంది. ఈ వేలంలో అవినీతి జరిగిందంటూ శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు భద్రకాళి అమ్మవారి ఆలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఆ తర్వాత కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి సహా పలువురు కాంగ్రెస్ నాయకులు తడి బట్టలతో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అధికార, ప్రతిపక్షాల సవాళ్లతో భద్రకాళి ఆలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.



## ఆలయ శుద్ధికి బీజేపీ యత్నం..

కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు రాజకీయాలతో గుడిని అపవిత్రం చేశారని ఆరోపిస్తూ ఆలయ సంప్రోక్షణకు బీజేపీ పిలుపునిచ్చింది. శుద్ధి కార్యక్రమం పేరుతో శనివారం గుడి వద్దకు వచ్చిన బీజేపీ నేతలు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారే అవకాశం ఉందని భావించిన పోలీసులు వారిని ప్రాంగణంలోకి అనుమతించలేదు. ఆలయ పవిత్రతకు భంగం కలిగిందని, కచ్చితంగా సంప్రోక్షణ నిర్వహించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. పోలీసుల చర్యతో బీజేపీ కార్యకర్తలు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. శాంతిభద్రతల దృష్ట్యా ముందస్తు చర్యగా వారిని అడ్డుకున్నట్లు పోలీసులు తెలిపారు. పలువురు బీజేపీ నేతలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. భద్రకాళి ఆలయం వద్ద జరిగిన ఈ పరిణామంతో స్థానిక రాజకీయ వర్గాల్లో వేడి రాజుకుంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో గుడి పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

చురకలు





# సర్ ప్రక్రియకు రాజకీయ పార్టీలే సహకరించాలి!

సర్ ప్రక్రియతో ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలు కంగారు పడుతున్నాయి. ఇబ్బడిముబ్బడిగా ఉన్న మద్దతుదారుల ఓట్లు పోతాయన్న భావనలో ఉన్నారు. ముఖ్యంగా ఆంధ్రావారిలో చాలామందికి తెలంగాణలో ఓటు ఉంది. దీనిపై వారు ఆందోళన చెందుతున్నారు. రెండు ఓట్లు ఉంటే తొలగించడం ఖాయం. అలాగే హైదరాబాద్,విజయవాడ లాంటి తదితర పట్టణాల్లో ఉన్నవారికి కూడా అటు సొంతూళ్ళు, ఇక్కడా ఓట్లు ఉన్నాయి. వీటిని తొలగిస్తే ఎలా అన్న ఆందోళనలో ఉన్నారు. అన్నింటికి మించి పాతబస్తీ లోనే ఎక్కువ గందరగోళం కనిపిస్తోంది. ఇక్కడ తిష్టవేసిన రోహింగ్యాలతో పాటు, ఇతర దేశాల వారిని గుర్తించడం కొంచెం కష్టమే. ఇకపోతే అధికారులు రోజువారీ సమీక్ష చేస్తూ సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటి వరకు ఎక్కడా ఎలాంటి పొరపాట్లు రాలేదు. నకిలీ ఓట్లను నిరోధించేందుకు పక్కాగా ఓ వ్యవస్థ అంటూ లేదు. ఆధార్, పాన్ కార్డులకు పర్మినెంట్ నంబర్ ఉంటోంది. కానీ ఓటుకు అలాంటిదేమీ లేదు. అలాంటి పక్కా వ్యవస్త ఉంటే తప్ప ఎన్నిసార్లు సర్ ప్రక్రియ చేపట్టినా నకిలీ ఓట్లు తొలగింపు అసాధ్యమే. ఇకపోతే ఇల్లుమారిన లేదా, చనిపోయిన వారి ఓట్లను ఎలా తొలగిస్తారన్నది కూడా ప్రశ్నే. ఇదిలావుంటే అన్ని రాజకీయ పార్టీలు సమావేశాలు పెట్టి తమ కార్యకర్తలను అప్రమత్తం చేస్తున్నాయి. ఓట్లు తొలగిపోకుండా చూడాలని జాగ్రత్తలు చెబుతున్నాయి. అందుకు బూత్‌లెవల్లో శిక్షణ కూడా ఇచ్చారు. ఓ వైపు ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే సమావేశాలు కొనసాగుతున్నాయి. దీనిని బట్టి రాజకీయ పార్టీల్లో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. నకిలీ ఓట్లను తొలగించే విధానాన్ని కేంద్ర ఎన్నికల సంఘం సర్ ద్వారా గత కొన్నేళ్లుగా సంస్కరిస్తోంది. ఇది కొత్తగా బిజెపి ఏలుబడిలో తీసుకువచ్చిందేమీ కాదు. గతంలో యూపిఎ హయాంలోనూ సర్ ప్రక్రియ సాగింది. అయితే అప్పట్లో తూతమంత్రంగా సాగడంతో ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. 'సర్' పక్రియ చట్టబద్ధమేనని, కానీ వాటి కోసం అవలంబించే పద్ధతుల్లో మార్పులు తెచ్చుకోవాలని ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం అన్ని రాజకీయ పార్టీలకు, కేంద్ర ఎన్నికల సంఘానికి హితవు చెప్పింది. ఓటు హక్కు ఒకటే యువత భవిష్యత్‌ను నిర్మించుకునేందుకు ఉన్న ఏకైక ఆయుధమని నమ్ముతుంటాం. ఓటు ఉంటేనే నేతలు ఉంటారు. అధికారం ఉంటుంది. అందుకే ఓట్ల కోసం అభ్యర్థులు, పార్టీలు డబ్బులు విరజిమ్మడం ద్వారా అధికార పీఠం దక్కించుకునేందుకు నానా గడ్డీ కరుస్తుంటారు. ఇప్పుడు సర్ ప్రక్రియ ద్వారా తమవారి ఓట్లు పోకుండా జాగ్రత్త పడడం ఇందులో భాగమే.ప్రజాస్వామ్యంలో ధనస్వామ్యం చొరబడిన తరవాత ప్రజాస్వామ్యం ఇప్పుడు వికటిస్తున్నది. ఈ పరిస్థితుల్లో 'ఓటు' దుర్వినియోగం అవుతోంది. డబ్బులు పెట్టి ఓట్లు కొనసడం అలవాటు చేసుకున్నారు. దొంగ ఓట్లతో జాతర నడిపిస్తున్నారు. స్థానికంగా లేని వారికి ఓటు హక్కు కల్పించడం, ఆ ఓటును ఎవరో వేసేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో సర్' పేరుతో అసలుసిసలు ఓటర్లను జాబితాలోంచి తీసేస్తున్నారన్న ఆరోపణల మధ్య రాజకీయ పార్టీలు ఓట్లను దక్కించుకునేందుకు జాగ్రత్త పడుతున్నాయి. బీహార్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, తదితర రాష్ట్రాలకు సర్ ప్రక్రియ పూర్తయిన తరవాతనే ఎన్నికలు జరిగాయి. కొన్ని చోట్ల ప్రభుత్వాలు మారడంతో ఓట్లను తొలగిస్తున్నారన్న ప్రచారం చేపట్టారు. ఇంత ప్రక్షాళన జరిగినా కొన్ని చోట్ల అక్రమంగా తమ ఓట్లు తొలగించారన్న ఆవేదనలు వినిపిస్తూనే ఉన్నాయి. సాధారణ పౌరులెవరికీ 'సర్' పట్ల ఎలాంటి అసంతృప్తి లేదు. ఈ పక్రియలో ఓటు హక్కు కోల్పోయామని ఆందోళన చెందిన ఓటర్లు కూడా ఇప్పుడు ఒక్కక్కరూ ఆందోళన చెందుతున్నారు. ఏ వ్యవస్థలో అయినా లోపభూయిష్టమైన విధానాలకు చెక్ పెట్టాల్సిందే. ఓటు ఉన్నవారు నిర్భయమంగా ఉండాల్సిందే. ఎలాంటి ఆందోళనలు అవసరం లేదు. ఎన్నికల సంఘం కూడా అలాంటి వారిని ఎక్కడా తప్పు పట్టడం లేదు. జాబితాలో తొలగించడం లేదు. అవగాహన లేనివారు మాత్రమే ఆందోళనతో అయోమయంలో పడిపోతున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా ఎంతో విశ్వసనీయత కలిగి ఉండటం అవసరం. రెండు ఓట్లు, ఇక్కడ లేని వారి ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు తొలగించేందుకు ఇసికి రాజకీయ పార్టీలు సహకరిస్తే సమస్య సులువుగా పరిష్కారం అవుతుంది. కానీ రాజకీయా పార్టీలు అలా చేయడం లేదు. రాజకీయ పార్టీల చర్యలు ఓటర్లలోనూ గందరగోళంలఅఓ పడేసేలా ఉంటోంది. ఓట్లు పోతాయంటూ చేస్తున్న హెచ్చరికలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారు తమ ఓటు ఎక్కడ పోతుందో అన్న ఆందోళన చెందుతున్నారు. శాశ్వతంగా ఒకే ప్రాంతంలో నివసించే వారిఓట్ల జోలికి ఇసి వెళ్లడం లేదు. కొన్ని చోట్ల తాము వెళ్లినప్పుడు ఓటర్లు అక్కడ లేకపోవడం, తగిన కారణాలు చూపక పోవడంతో తొలగించడం జరుగుతోంది. ఇంటింటికీ వెళ్లి ధృవీకరణద్వారా జాబితాను జల్లెడ పడుతున్నారు. ఒకటి కన్నాఎక్కువ ప్రాంతాల్లో పేర్లు నమోదై, వారు మరో చోట నివసిస్తుంటే వారి ఓటు హక్కు ఆ ప్రాంతానికే మార్చుకోవాలి. ఎక్కడ శాశ్వత నివాసం ఉంటుందో అక్కడే ఓటును పొందాలి. అంతేగానీ పలుచోట్ల ఓటును కలిగి ఉండడం కూడా నేరం. ఇలాంటి విషయాలను రాజకీయా పార్టీలు ప్రచారం చేయడం లేదు. రాజకీయ ఎత్తుగడ కోసం ఓట్లు తొలగిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నాయి. 'సర్' పూర్తిగా చట్టబద్ధమైన పారదర్శక పక్రియ అనడంలో సందేహమే లేదు. కేంద్ర ఎన్నికల సంఘం తరచు సమీక్షలు చేయడం ద్వారా ఓటర్ల గుర్తింపునకు వెసులు బాటుగా అవగాహన కల్పించడం, వారి ఓటుకు చోటు లభించేటట్లు చేయడం అత్యంతావశ్యకం. అవగాహనలోపం వల్ల అర్హులైన ఓటర్లు కూడా తమ 'ఓటుహక్కును దక్కించుకోవడం కోసం అజాగ్రత్తగా ఉండరాదు. రాజకీయ పార్టీలు గ్రామాల వారీగా జాబితాలు ముందుర వేసుకుంటే ఎవరు స్థానికులో ఎవరు కాదో తెలుస్తుంది. ఎవరు ఓటరో కాదో తెలుస్తుంది. చనిపోయిన వారు ఎవరో కూడా వారికి తెలుసు. ఇలాంటి విషయాల్లో ఆయా పార్టీలు నేరుగా ఎన్నికల సంఘానికి సహకరించి, అనర్హత కలిగిన ఓట్లను తొలగించాలి. అప్పుడే ఓటరు సమగ్ర జాబితా రూపొందగలదు.

# యుద్ధం వేళ ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

- ఇంధనంపై ప్రజలను భయపెట్టే యత్నాలు జరిగాయి
- అయితే సమర్థంగా సవాళ్లను అధిగమంచగలిగాం
- రాజస్థాన్‌లో గ్రీన్ రిఫైనరీని ప్రారంభించిన ప్రధాని మోడీ




**జయపుర, జులై 4:** పశ్చిమాసియా సంక్షోభం వేళ దేశంలో ఇంధన సంక్షోభాన్ని విజయవంతం ఎదుర్కొన్నట్లు ప్రధాని మోడీ అన్నారు. ప్రజలను భయపెట్టే ప్రయత్నాలు జరిగాయి. రాజకీయాలు చేశారు. కానీ వారి కుట్రలు ఫలించలేదు. కొన్ని చిన్న చిన్న ఇబ్బందులు తప్ప దేశంలో ఎక్కడా ఇంధన సరఫరా ఆగలేదఅని అన్నారు. శనివారం రాజస్థాన్‌లోని బాలోత్రా జిల్లా పచ్‌పద్రాలో దేశంలోని తొలి గ్రీన్‌ఫీల్డ్ సమగ్ర రిఫైనరీ–పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌ను మోడీ ప్రారంభించారు. సుమారు రూ.1.06 లక్షల కోట్ల విలువైన పెట్రో కెమికల్స్, రైల్వేలు, రహదారులు, మెట్రో, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ ప్రసార ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. దేశ ఇంధన భద్రత, పశ్చిమాసియా యుద్ధం సమయంలో భారత్ ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని అధిగమించిన విధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన మార్కెట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని ప్రధాని తెలిపారు. ఈ సమయంలో భారత్‌లో ఇంధన కొరత వస్తుందని కొందరు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ప్రతిపక్షాలను ఉద్దేశించి ఆరోపించారు. ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ చమురు మార్కెటింగ్ సంస్థలు రూ.75 వేల కోట్లకు పైగా నష్టాన్ని భరించాయని తెలిపారు. ప్రజలపై భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని కూడా తగ్గించిందని పేర్కొన్నారు. భారత్‌కు పెద్దగా చమురు నిల్వలు లేవని గుర్తుచేసిన ప్రధాని.. యుద్ధం సమయంలో ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి 120 డాలర్లకు పెరిగిందన్నారు. కొన్ని దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు 40–50 శాతం పెరగడమే కాకుండా రేషన్ విధానం కూడా అమలు చేశారని చెప్పారు. అయితే భారత్‌లో మాత్రం ఒక్కరోజు కూడా ఇంధన కొరత తలెత్తలేదని స్పష్టం చేశారు. సంక్షోభానికి ముందు భారత్ కేవలం 25–26 దేశాల నుంచే ఇంధనం దిగుమతి చేసుకునేదని.. కానీ యుద్ధం ప్రారంభమైన తర్వాత భారత దౌత్యపరమైన ప్రయత్నాల వల్ల 40కిపైగా దేశాల నుంచి చమురు, ఇంధనం దిగుమతి చేసుకున్నామని ప్రధాని వెల్లడించారు. దేశ ప్రయోజనాలు, ప్రజల సంక్షేమమే భారత్‌కు అత్యంత ప్రాధాన్యం అనే సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చామని అన్నారు. భారత్‌కు అవసరమైన ఎల్పీజీలో దాదాపు 60 శాతం దిగుమతుల ద్వారానే వచ్చేదని.. అందులో 90 శాతం హోర్ముజ్ జలసంధి మార్గంలో గల్ఫ్ దేశాల నుంచే వచ్చేదని తెలిపారు. యుద్ధం కారణంగా సరఫరా దాదాపు నిలిచిపోయిన సమయంలో రిఫైనరీల సామర్థ్యాన్ని వినియోగించి కేవలం ఏడు రోజుల్లోనే దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని 35 వేల మెట్రిక్ టన్నుల నుంచి 54 వేల మెట్రిక్ టన్నులకు పెంచామని చెప్పారు. ఇప్పటివరకు ఎల్పీజీ ఉత్పత్తి చేయని కొన్ని రి÷నైరీలను కూడా ఈ అవసరానికి అనుగుణంగా మార్చినట్లు తెలిపారు.దేశవ్యాప్తంగా పైప్ ద్వారా సహజ వాయువు కనెక్షన్లను వేగంగా విస్తరించామని, 11 లక్షలకుపైగా కుటుంబాలకు కొత్త పీఎన్‌జీ కనెక్షన్లు అందించామని ప్రధాని వెల్లడించారు.మార్కెట్ అంచనాల ప్రకారం గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.2,000 వరకు చేరే అవకాశం ఉన్నప్పటికీ.. ప్రస్తుతం రూ.950లోపే అందిస్తున్నామని పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం 21వ శతాబ్దంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభానికి కారణమైందన్నారు. సమస్యను ముందుగానే అంచనా వేసి సరైన నిర్ణయాలు తీసుకున్నాం. దేశ వనరులను సమర్థంగా వినియోగించాం. దౌత్య శక్తిని సానుకూలంగా ఉపయోగించాం. అందుకే భారత్ ఈ సంక్షోభాన్ని విజయవంతంగా అధిగమించిందని చెప్పారు. ఇర పచ్‌పద్రా రిఫైనరీతో భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ దేశంగా మరింత బలోపేతమవుతోందని ప్రధాని తెలిపారు. ఈ సమగ్ర రి÷నైరీకి ఏడాదికి 2.4 మిలియన్ మెట్రిక్ టన్నుల పెట్రోకెమికల్ ఉత్పత్తి సామర్థ్యం ఉందన్నారు. ఇది దేశ ఇంధన భద్రతను పెంచడంతో పాటు పెట్రోకెమికల్ రంగంలో స్వయం సమృద్ధికి దోహదపడుతుందని.. వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అదనంగా జైపూర్ మెట్రో రెండో దశ, రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, బికానేర్ సోలార్ పార్కులు, విద్యుత్ ప్రసార లైన్లు సహా పలు అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రధాని దేశానికి అంకితం చేశారు.

# పార్లమెంట్ వర్షాకాల షెడ్యూల్ ఖరారు

- జూలై20 నుంచి ఆగస్ట్ 13 వరకు సమావేశాలు
- ఎక్స్ వేదికగా వెల్లడించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు



**న్యూఢిల్లీ, జులై 4:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల షెడ్యూల్ ఖరారయ్యింది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోషల్ మీడియా ఎక్స్‌లో పేర్కొన్నారు. జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు సమావేశాలు జరగనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సిఫారసు మేరకు పార్లమెంట్ 2026 వర్షాకాల సమావేశాలను నిర్వహించేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. దేశ ప్రాధాన్యత కలిగిన కీలక అంశాలపై అర్థవంతమైన చర్చలు, సమగ్ర చర్చోపచర్చలు, నిర్ణయాలు తీసుకునేందుకు ఈ సమావేశాలు వేదిక కానున్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇక ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశముండగా దేశ ఆర్థిక వ్యవస్థ, జాతీయ భద్రత, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమం, ఇతర సమకాలీన అంశాలపై కూడా ఇరు సభల్లో విస్తృతంగా చర్చలు జరిగే అవకాశం ఉంది. అలాగే ప్రతిపక్ష పార్టీలు కూడా వివిధ ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించే అవకాశముంది. ఇటీవలి పరిణామాలు, దేశీయ, అంతర్జాతీయ అంశాలతో పాటు పలు రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలను కూడా ప్రతిపక్ష పార్టీలు ఈ సమావేశాల్లో ప్రస్తావించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం కూడా తన కీలక విధానాలు, సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను సభ ముందుకు తీసుకురానుంది. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ముందు ముగియనున్న ఈ సమావేశాల్లో పలు కీలక నిర్ణయాలు, చర్చలు జరిగే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వర్షాకాల సమావేశాల్లో ఎన్డీఏ ప్రభుత్వం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా రెండు రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకురానున్నట్లు తెలుస్తోంది. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజనను సవరణలతో మళ్లీ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ బిల్లులో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల సభ్యుల సంఖ్యను 50 శాతం పెంచే ప్రతిపాదన కూడా ఉండొచ్చని సమాచారం. ఇక ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీయడానికి సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం, అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, నిరుద్యోగ సమస్య వంటి అంశాలపై కేంద్రాన్ని ఇరుకున పెట్టేందుకు వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఈసారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు హాట్ హాట్‌గా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

# బద్రీనాథ్ ఆలయంలో ఆర్థిక అవకతవకలు

- భైరవ సేన అనే సంస్థ ఆరోపణలు
- అంతర్గత విచారణకు ఆదేశించిన ఆలయ కమిటీ



**డెహ్రాడూన్, జులై 4:** అయోధ్య రామ మందిరంలో విరాళాల దుర్వినియోగం ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాజాగా బద్రీనాథ్ ధామ్‌లోనూ ఇలాంటి పుకార్లు జోరందుకున్నాయి. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన బద్రీనాథ్–కేదార్‌నాథ్ ఆలయ కమిటీ అంతర్గత విచారణకు ఆదేశించింది. ఈ మేరకు బీకేటీసీ ప్రెసిడెంట్ హేమంత్ ద్వివేది మాట్లాడుతూ.. 'నిధుల దుర్వినియోగం జరిగిందంటూ సామాజిక మాధ్యమాల్లో ఆరోపణలు వెల్లువెత్తున్నందున విచారణ కమిటీ ఏర్పాటుచేయాలని నిర్ణయించాం. ఈ వ్యవహారానికి సంబంధించి విధుల్లో ఉన్న ఉద్యోగుల వివరాలనూ కోరాం' అని తెలిపారు. కాగా.. బద్రీనాథ్ ఆలయంలో ఆర్థిక అవకతవకలు జరిగాయని భైరవ సేన అనే ఓ సంస్థ ఆరోపించింది. ఆలయ కమిటీ ఛైర్మన్ వ్యక్తిగత సహాయకుడికి సంబంధమున్న నిధుల దుర్వినియోగం ఆరోపణలపై పారదర్శకంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేసింది. అయితే.. దీనిపై ప్రెసిడెంట్ ద్వివేది స్పందిస్తూ.. సోషల్ మీడియాలో తన వ్యక్తిగత కార్యదర్శిగా పేర్కొన్న వ్యక్తి బీకేటీసీలో ఓ ఉద్యోగి మాత్రమేనన్నారు. ఆయన గతంలో ముగ్గురు మాజీ ఛైర్మన్ల వద్ద పనిచేశారని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయమై బీకేటీసీ ప్రధాన కార్యనిర్వాహక అధికారి సోహన్ సింగ్ రంగడ్ మాట్లాడుతూ.. 'నిధుల దుర్వినియోం ఆరోపణలు రావడంతో వెంటనే ఆలయ ప్రాంగణంలోని సీసీటీవీ కెమెరాలను పరిశీలించాం. కానీ ఆ ఫుటేజీ స్పష్టంగా లేకపోవడంతో పూర్తివివరాలు తెలియరాలేదు. అయినప్పటికీ ఈ విషయం అత్యంత సున్నితమైనదిగా భావించి, ఛైర్మన్‌కు నివేదించాం' అని చెప్పారు. ఛైర్మన్ ఆదేశాలతో సదరు ఉద్యోగుల వివరాలు సేకరించడం సహా వారిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టేందుకు అంతర్గత కమిటీని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించామన్నారు. విచారణలో ఎవరైనా తప్పుచేసినట్లు రుజువైతే.. వారిపై బీకేటీసీ చట్టం–1939, ఉద్యోగుల ప్రవర్తనా నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఈ అంశం కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి సంబంధించినది కావడంతో నిరాధార ఆరోపణలు, తప్పుదోవ పట్టించే ప్రచారాలకు ప్రజలు దూరంగా ఉండాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.

# ఆలేరులో లక్ష్మీ డిజిటల్ ఫ్లెక్సీ ప్రింటింగ్ ప్రారంభం

- యువ పారిశ్రామికవేత్తలకు సమాజంలో విశేష అవకాశాలు: టీజేఏ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ షానూర్

**ఆలేరు, జూలై 4 :**



ఆలేరు పట్టణ కేంద్రంలో యువ వ్యాపారవేత్త మద్దూరు శ్రీకాంత్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన లక్ష్మీ డిజిటల్ ఫ్లెక్సీ ప్రింటింగ్ షాప్ శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ (టీజేఏ) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ షానూర్ షాప్‌ను ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా షానూర్ మాట్లాడుతూ, యువత ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురుచూడకుండా స్వయం ఉపాధి రంగంలోకి అడుగుపెట్టి కొత్త అవకాశాలను సృష్టించుకోవడం అభినందనీయమని అన్నారు. నాణ్యమైన సేవలు, వినియోగదారులకు సకాలంలో సేవలందించడం ద్వారా వ్యాపార సంస్థలు ప్రజల విశ్వాసాన్ని సంపాదించడంతో పాటు మరింత అభివృద్ధి సాధిస్తాయని పేర్కొన్నారు. పట్టణ ప్రజలకు అత్యాధునిక డిజిటల్ ప్రింటింగ్ సేవలు అందించే లక్ష్యంతో ప్రారంభమైన లక్ష్మీ డిజిటల్ ఫ్లెక్సీ ప్రింటింగ్ సంస్థ మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని ఆకాంక్షించారు. స్థానిక ప్రజలకు అవసరమైన అన్ని రకాల డిజిటల్ ప్రింటింగ్ సేవలు ఒకేచోట అందుబాటులోకి రావడం సంతోషకరమని అన్నారు. షాప్ నిర్వాహకులు మాట్లాడుతూ, తమ సంస్థలో ఫ్లెక్సీలు, బ్యానర్లు, వివాహ ఆహ్వాన పత్రికలు, విజిటింగ్ కార్డులు, బ్రోచర్లు, బిల్ బుక్స్, డిజిటల్ ప్రింటింగ్, లామినేషన్, ఇతర ఆధునిక ప్రింటింగ్ సేవలను నాణ్యతతో, సరసమైన ధరలకు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు సర్పంచ్ జూకంటి అనిల్, జర్నలిస్ట్ మహేందర్, స్థానిక ప్రముఖులు, స్నేహితులు, వ్యాపారవేత్తలు, ప్రజలు పాల్గొని నూతన సంస్థ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# కామ్రేడ్ అరుణోదయ నాగన్నకు ప్రజా సంఘాల నేతల నివాళి

**ప్రజా ఉద్యమాలకు ఆయన సేవలు చిరస్మరణీయం: నాయకులు**

**ఆలేరు, జూలై 4:**



అనారోగ్యంతో జూలై 3న కన్నుమూసిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ అరుణోదయ నాగన్నకు శనివారం ఖమ్మంలో ప్రజా సంఘాల నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల భిక్షపతి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ జనార్ధన్ మాట్లాడుతూ, నాగన్న తన గానంతో ప్రజల్లో చైతన్యం నింపి ప్రజా ఉద్యమాలకు విశేష సేవలందించారని కొనియాడారు. ప్రజల విముక్తి కోసం జీవితాన్ని అంకితం చేసి, ఆట–పాటల ద్వారా విప్లవ భావజాలాన్ని గ్రామీణ ప్రాంతాలకు చేర్చిన అరుదైన ప్రజా కళాకారుడని పేర్కొన్నారు. ప్రజా గాయకుడిగానే కాకుండా ఉద్యమ నాయకుడిగా రైతు, కూలీలను సంఘటితం చేసి అనేక ప్రజా ఉద్యమాలకు బాటలు వేసిన వ్యక్తిగా నాగన్న చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ద్వారా వందలాది కళాకారులను తీర్చిదిద్దుతూ ప్రజా సంస్కృతిని ప్రతిబింబించే కళారూపాలకు విశేష సేవలందించారని గుర్తు చేశారు. నివాళి కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఇక్కిరి సహదేవ్, పీఓడబ్ల్యూతో జిల్లా అధ్యక్షురాలు ఆర్ సీత, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు పద్మ సుదర్శన్, పీవైఎల్ జిల్లా అధ్యక్షులు మారుజోడు సిద్దేశ్వర్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షులు శికీలం కుమారస్వామి, నాయకులు కుర్రి మార్కండేయ, ద్వారా భాస్కర్, కడకంచి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల సేవలు చిరస్మరణీయం

**జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్**

**జగిత్యాల, జూలై - 04**

మహనీయుల సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ కొనియాడారు. దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఘన నివాళి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించగా, కలెక్టర్ బి.సత్య ప్రసాద్ హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు ఉద్యమ సాయుధ దశలో చేసిన పోరాటాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి కె. జయరాజ్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కిషన్, కలెక్టరేట్ సిబ్బంది, మరియు తదితరులు పాల్గొన్నారు.

# పద్మశ్రీ చింతకింది మల్లేశంకు అనురాగ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్

**చేనేతకు చేసిన విశిష్ట సేవలకు గుర్తింపు**

**ఆలేరు, జూలై 4 :**




చేనేత రంగంలో సాంకేతిక ఆవిష్కరణల ద్వారా విశేష సేవలు అందించిన ఆలేరు పట్టణానికి చెందిన ఆసు యంత్రం సృష్టికర్త, పద్మశ్రీ చింతకింది మల్లేశంకు హైదరాబాద్‌లోని అనురాగ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ (హానరరీ డాక్టరేట్) ప్రదానం చేసింది. యూనివర్సిటీ మూడవ కన్వొకేషన్ కార్యక్రమంలో ఈ ప్రతిష్ఠాత్మక గౌరవాన్ని అందజేశారు. చేనేత కళాకారులు, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న శారీరక శ్రమను తగ్గించాలనే లక్ష్యంతో చింతకింది మల్లేశం రూపొందించిన ఆసు యంత్రం దేశవ్యాప్తంగా విశేష గుర్తింపు పొందింది. ఈ యంత్రం ద్వారా వేలాది మంది చేనేత మహిళల శ్రమ గణనీయంగా తగ్గడంతో పాటు ఉత్పాదకత పెరిగి, వారి జీవనోపాధి మెరుగుపడింది. చేనేత రంగంలో ఆయన చేసిన వినూత్న కృషి, సామాజిక సేవలను గుర్తిస్తూ అనురాగ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. ఈ సందర్భంగా చింతకింది మల్లేశం మాట్లాడుతూ, 2019లో గీతం యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకోవడం తన జీవితంలో ఒక మధుర ఘట్టమని, తిరిగి 2026లో అనురాగ్ యూనివర్సిటీ నుంచి మరోసారి అదే గౌరవం దక్కడం ఎంతో అదృష్టంగా, ఆనందంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక గౌరవాన్ని అందించిన అనురాగ్ యూనివర్సిటీ చైర్మన్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, యూనివర్సిటీ యాజమాన్యం, అధ్యాపకులు, నిర్వాహకులకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ గౌరవం తన బాధ్యతను మరింత పెంచిందని, చేనేత రంగ అభివృద్ధి కోసం ఇంకా ఎక్కువగా పనిచేసేందుకు ఇది తనకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రముఖులు, అధ్యాపకులు, విద్యార్థులు, ఆహ్వానితులు పాల్గొని పద్మశ్రీ చింతకింది మల్లేశంను ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడుతూ, చేనేత రంగానికి ఆయన చేసిన కృషి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

# ఏపీకే ఫైల్స్, తెలియని వెబ్సైట్లతో జాగ్రత్తగా ఉండాలి

- అప్రమత్తతో సైబర్ నేరాల బారిన పడకుండా అడ్డుకోగలం-ఎస్పీ.
- ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్స్, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటి నూతన పద్ధతులలో మోసం చేస్తున్న సైబర్ క్రైమ్ నేరగాళ్లు
- మోసపోయామని గ్రహించిన వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సంప్రదించాలి.
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS.

**నారాయణపేట, జులై,04**




ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతులను ఉపయోగించి ప్రజలను మోసగిస్తున్న సందర్భంలో నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రజలందరికీ అవగాహన, అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అడ్డుకోగలమని ఒక ప్రకటన తెలియజేశారు. ప్రస్తుతం సమాజంలో ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు, స్టాక్ మార్కెటింగ్ అంటూ లాభాలు చూపిస్తామంటూ ప్రైవేటు వ్యక్తులు చేస్తున్న మోసాలు సామాన్య ప్రజలకు తెలియాలని అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా వాట్సాప్ నందు టెలిగ్రామ్ నందు సోషల్ మీడియాలలో ఏపీకే ఫైల్స్ రావడం వాటి ద్వారా మొబైల్ కంట్రోల్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లడం లాంటి సంభవిస్తుందని వాటిని అడ్డుకోవడానికి అప్రమత్తత ప్రధానాస్త్రంగా ఉంటుందని తెలిపారు. ఒకవేళ మోసగాళ్ల చేత మోసపోయినట్లయితే వెంటనే (గోల్డెన్ హవర్) లో జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి లేదా సైబర్ క్రైమ్ వెబ్సైట్ నందు ఫిర్యాదు చేయడం మొదటి కర్తవ్యం గా వ్యవహరిస్తుందని తెలిపారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్ నేరస్తులు వినియోగిస్తున్న నూతన పద్ధతులు ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, యూపీఐ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్లు, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటిది జరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ ముఖ్యంగా యువత మాయమాటలకు నమ్మి మోసపోకుండా ఉండాలని తెలిపారు. సైబర్ క్రైమ్ నేరగాళ్లు వినియోగిస్తున్న పద్ధతిని తెలియజేస్తూ ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు ముఖ్యంగా డబ్బులను వారి సొంత వెబ్సైట్ ల నందు ఇన్వెస్ట్మెంట్ చేసిన దానికన్నా ఎక్కువగా చూపిస్తారని ఒకవేళ డబ్బులను తీయాలి అనుకుంటే రాకుండా ఉంటాయని తెలియచేశారు.జిల్లా పరిధిలో ప్రజలకు సైబర్ నేరాల పైన విస్తృతంగా అవగాహన కార్యక్రమలు నిర్వహించాలని పోలీసు అధికారులకు ఎస్పీ తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్

**9వ వార్డులో విస్తృత పర్యటన.. సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు**



**ఆలేరు, జూలై 4 :**

ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ విస్తృతంగా పర్యటించి, నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. వార్డు కౌన్సిలర్ పస్తం ఆంజనేయులుతో కలిసి లబ్ధిదారులతో మాట్లాడి, ఇళ్ల నిర్మాణ పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను చైర్‌పర్సన్ దృష్టికి తీసుకురాగా, వాటిని పరిశీలించిన ఆమె సంబంధిత అధికారులతో చర్చించి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వార్డులో తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ తదితర ప్రజా సమస్యలపై కూడా ఆమె ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాస్ రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాస్ రెడ్డి, 2వ వార్డు కౌన్సిలర్ వనరాశి మరియమ్మ, 11వ వార్డు కౌన్సిలర్ జూకంటి సంపత్, శానిటేషన్ సూపర్వైజర్ ఎలుగల శివుడు, వార్డు ప్రజలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య త్యాగస్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

**ఆలేరులో వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు**

**ఆలేరు, జూలై 4 :**



తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా శనివారం ఆలేరు పట్టణంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఎగ్గిడి సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు కొమురయ్య త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలన, దొరల దౌర్జన్యాలు, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన దొడ్డి కొమురయ్య తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే మహానేత అని కొనియాడారు. ఆయన త్యాగస్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజ అభ్యున్నతి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కారి కృష్ణ, 5వ వార్డు కౌన్సిలర్ పాశికంటి సంపత్, కౌన్సిల్ సభ్యుడు వడ్డమాని నరేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎలగల వెంకటేష్, బీజేవైఎం నాయకుడు కంతుల శంకర్, సీనియర్ నాయకులు తునికి దశరథ్, కళ్లెం రాజ్, మండల కార్యదర్శి బైరి మహేందర్, బూత్ అధ్యక్షుడు ఎగిడి సిద్ధులు, బందెల విష్ణు, పేరుపు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# అరుణోదయ నాగన్నకు విప్లవ జోహార్లు

**ఆయన పాటలు పీడిత ప్రజలకు చిరకాలం స్ఫూర్తి: సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న**

**ఆలేరు, జూలై 4:**



అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర గౌరవాధ్యక్షులు, సీపీఐ(ఎంఎల్) నాయకులు అరుణోదయ నాగన్న మృతి విప్లవోద్యమాలకు తీరని లోటని సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న పేర్కొన్నారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన నాగన్నకు విప్లవ జోహార్లు అర్పించారు. నాగన్న తన గాత్రంతో పీడిత ప్రజల జీవితాలను, గోదావరి లోయ పోరాటాలను, భూమి, భుక్తి, విముక్తి ఉద్యమాల స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లారని తెలిపారు. అమరుల త్యాగాలను పాటల రూపంలో చిరస్థాయిగా నిలిపిన గొప్ప ప్రజా కళాకారుడిగా ఆయన సేవలను కొనియాడారు. తన చివరి శ్వాస వరకు నమ్మిన విలువలకు కట్టుబడి, ప్రలోభాలకు లొంగకుండా విప్లవ సాంస్కృతిక ఉద్యమంలో నిబద్ధతతో పనిచేసిన ఆదర్శ సేనానిగా నాగన్న నిలిచిపోతారని ప్రసాదన్న పేర్కొన్నారు. ఆయన పాటలు, ఆశయాలు రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు.

# జూలై 8న అతిథి ఉపాధ్యాయుల నియామకానికి ఇంటర్వ్యూలు...

**కరీంనగర్ రీజినల్ కోఆర్డినేటర్ అంజలి**

**పెద్దపల్లి, జూలై - 04:**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే బి.సి. గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో బోధించడానికి అతిథి ఉపాధ్యాయుల నియామకానికి ఇంటర్వ్యూలు, డెమో నిర్వహించనున్నట్లు మహాత్మా జ్యోతిబా పూలే ఎడ్యుకేషనల్ సొసైటి ఉమ్మడి కరీంనగర్ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ అంజలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

చురకలు

ఆదివారం 05 జూలై 2026

## ఎల్ ఓ సి చెక్కును అందజేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి.



**వలిగొండ జూలై 04**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని అరూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొల్లూరు మైసమ్మ గత 15 రోజులుగా హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో డయాలసిస్ తో బాధపడుతున్నారు. కోల్లూరి మైసమ్మ వైద్య ఖర్చుల నిమిత్తం భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి 3లక్షల రూపాయల ఎల్ఓసి చెక్కులను హైదరాబాదులోని స్వగృహం వద్ద బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అరూరు గ్రామ సర్పంచ్ సుక్క ముత్యాలు గ్రామ వార్డు మెంబర్ పులగళ్ళ మత్స్యగిరి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కొప్పుల బాలరాజ్,సురకంటి నాగిరెడ్డి,కొల్లూరి రామచంద్రం,మారగోని శ్రీనివాస్, కొల్లూరి వినోద్ కుమార్, కొల్లూరి శ్రీకాంత్,కొల్లూరి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నాగారం గ్రామంలో "సర్ " కార్యక్రమాన్ని పరిశీలించిన సీఈవో ఆర్డీవో కృష్ణారెడ్డి.



**వలిగొండ జూలై 04**

యాదాద్రి భువనగిరి జిల్లా నల్గొండ మండలం పరిధిలోని నాగారం గ్రామంలో బి ఎల్ ఓ లు డిఎల్ఓ లు నిర్వహిస్తున్న నిర్వహిస్తున్న "సర్ " (సమగ్ర సవరణ) కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ డిప్యూటీ సిఈఓ రాంప్రసాద్ రెవిన్యూ డివిజన్ అధికారి కృష్ణారెడ్డి సందర్శించారు. మన ఓటు మన బాధ్యతగా ప్రతి ఒక్కరు గ్రామంలో ఇంటికి వద్దకు వచ్చిన బిఎల్ఓ,లు బిఎల్ఏలకు సమగ్ర సమాచారం అందించి తమ ఓటు హక్కును కాపాడుకోవాల్సిందిగా జిల్లా రెవిన్యూ డివిజన్ అధికారి కృష్ణారెడ్డి జిల్లా డిప్యూటీ సీఈఓ రాంప్రసాద్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ దశరథ ఆర్ ఐ కరుణాకర్ రెడ్డి గ్రామ పంచాయతీ కార్యదర్శి అశ్విని జిపిఓ సాయికుమార్ బిఎల్ఓ అనేపర్తి బిక్షపతి కదిరేని ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టరేట్ ఐడీఓసీ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహింపు



**వికారాబాద్, జులై,04**

జిల్లా కలెక్టరేట్ ఐడీఓసీ సమావేశ మందిరంలో అమరవీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరవీరుడిగా దొడ్డి కొమురయ్య చేసిన త్యాగం చిరస్మరణీయమని పేర్కొన్నారు.సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి మాధవ రెడ్డి, అడిషనల్ డిఆర్డిఏ సత్తయ్య, డి పి ఆర్ ఓ చెన్నమ్మ, వ్యవసాయ అధికారి కవిత, డి.ఎస్. ఓ సుదర్శన్ వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని దొడ్డి కొమురయ్యకు ఘనంగా నివాళులర్పించారు.

## ఖమ్మం జిల్లాలో 98.82% ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి

**ఖమ్మం, జూలై 4 .**



ఖమ్మం జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమం పారదర్శకంగా, వేగంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ 98.82 శాతం పూర్తవగా, పూర్తి చేసిన ఫారాల స్వీకరణతో పాటు డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. జిల్లాలో 1,460 మంది బూత్ లెవల్ అధికారులు ప్రత్యేక సవరణ కార్యక్రమంలో పాల్గొంటున్నారని, ఇప్పటివరకు 11.85 శాతం ఫారాల డిజిటలైజేషన్ పూర్తైందని తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, వ్యక్తిగత వివరాల సవరణలను నిబంధనల ప్రకారం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు సహాయంగా అన్ని మునిసిపల్, మండల కేంద్రాల్లో సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసి, ఫారాల నింపడంలో మార్గదర్శనం చేస్తున్నట్లు తెలిపారు. ఓటర్ల ప్రత్యేక సవరణపై అపోహలు నమ్మొద్దని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను సకాలంలో సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# యువత సమస్యల పరిష్కారమే డీవైఎఫ్ఐ లక్ష్యం

**ఆలేరు మున్సిపల్ మూడవ పట్టణ మహాసభ కరపత్రం ఆవిష్కరణ**

**ఆలేరు, జూలై 4 :**



యువత హక్కుల పరిరక్షణ, నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం డీవైఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తోందని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు వడ్డెమాన్ విప్లవ్ కుమార్ అన్నారు. ఈ నెల 7న ఆలేరులో నిర్వహించనున్న డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డీవైఎఫ్ఐ) మున్సిపల్ మూడవ పట్టణ మహాసభకు సంబంధించిన కరపత్రాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, ఉద్యోగ నోటిఫికేషన్ల పేరుతో యువతను కాలయాపనకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని అన్నారు. చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా ప్రభుత్వాలు నిరాశకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. యువత సమస్యలపై డీవైఎఫ్ఐ నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తూ, హక్కుల సాధన కోసం పోరాటం కొనసాగిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 7న జరగనున్న డీవైఎఫ్ఐ ఆలేరు మున్సిపల్ మూడవ పట్టణ మహాసభను యువత పెద్ద సంఖ్యలో విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో చెన్న రాజేశ్, మొరుగాడి పృథ్వి, ఎక్కలదేవి భాస్కర్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కాసుల నరేష్, మాదాని నవీన్, కటకం సుదర్శన్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ పొందిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్. వల్లమల్ల రఘుపతి

**వలిగొండ జూలై 04**




యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గోపరాజు పల్లి గ్రామానికి చెందిన సాయమ్మ నరసయ్య పెద్ద కుమారుడు తేదీ 08-06-1965 జన్మించాడు. ప్రాథమిక విద్యను స్థానిక పాఠశాలలో ఉన్నత మరియు మాధ్యమిక విద్యను రామన్నపేట కళాశాలలో చదివి రాష్ట్రస్థాయి పేరెన్నిక గల జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం హైదరాబాదు నుండి సాంకేతిక పట్టాను అందుకుని జాతీయ విశ్వవిద్యాలయం అయిన హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పంచాయతీరాజ్ విభాగంలో సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ గా వీధుల్లో చేరారు. ఉద్యోగ ధర్మంలో భాగంగానే విధులు నిర్వహించి ముచ్చటగా మూడు మాటలు ఉత్తమ అధికారిగా జిల్లా ఉన్నత అధికారులచే ప్రశంస సన్మాన పత్రం అందుకున్నారు. అక్షర పరిమళ మెరుగని నిరుపేద కుటుంబంలో జన్మించి ఉన్నత విద్యావంతునిగా మానసీయ విలువలు కలిగిన వారిగా సహచరులకు వేగుచుక్కగా నిస్వార్థ ధ్రువదారిగా, స్నేహశీలుగా మృదుస్వభావిగా అభ్యుదయ వాదిగా అంబేద్కర్ ఆశయ ప్రేమికుడిగా సుగుణ సంపన్నుడుగా మంచి పేరు తెచ్చుకున్న వ్యక్తి పదవి విరమణ పొందుతున్న సందర్భంగా జై భీమ్ సేన కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ సేన కమిటీ అధ్యక్షులు వల్లమల్ల రత్నయ్య, ఉపాధ్యక్షులు కట్ట సురేష్, వల్లమల్ల రాజు, కార్యదర్శి నీలం నరేందర్, గ్రామ సర్పంచ్ సలిగంజి పృథ్వి గౌరవ సలహాదారులు సంగిశెట్టి రాములు,సంగిశెట్టి సుందరయ్య, మాణిక్యరావు, సంగిశెట్టి అనిల్, వల్లమల్ల స్వామి, సెక్రెటరీ వల్లమల్ల మత్స్యగిరి, నీలం నరేష్, నీలం సుమన్, ఎర్ర మత్స్యగిరి, రిటైర్డ్ ఎంప్లాయిస్ సంగిశెట్టి దేవదాస్ రాపోలు లింగమయ్య పెరమాండ్ల కృష్ణయ్య, బంధుమిత్రులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్ ఫారాలపై అవగాహన పెంపొందించాలి

- **కళాశాల విద్యార్థులు, గ్రామస్థులకు ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమం**

**ఆలేరు, జూలై 4 :**



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల పూరింపుపై ప్రతి ఒక్కరికీ పూర్తి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఆలేరు మండలంలో శనివారం విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులతో పాటు పలు గ్రామాల గ్రామస్థులు, ఉపాధ్యాయులకు ఎన్యుమరేషన్ ఫారాల ప్రాధాన్యత, వాటిని సక్రమంగా పూరించే విధానంపై అధికారులు వివరించారు. ఆలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకు ఎన్యుమరేషన్ ఫారాలపై అవగాహన ఉంటే వారు తమ ఫారాలతో పాటు కుటుంబ సభ్యుల ఫారాలను కూడా ఎలాంటి తప్పులు లేకుండా సరిగా పూరించగలరని తెలిపారు. విద్యార్థులు తమ గ్రామాల్లోని ఓటర్లకు కూడా సరైన సమాచారం అందించి అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషించగలరని అన్నారు. ఎన్యుమరేషన్ ఫారాల పూరింపులో ఎలాంటి సందేహాలు లేదా ఇబ్బందులు ఎదురైనా సంబంధిత ★బీఎల్వోలు (బూత్ లెవల్ అధికారులు)ను సంప్రదించాలని ఆయన సూచించారు. ప్రతి అర్హ ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదు కావడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. అనంతరం కొల్లూరు గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో గ్రామస్థులకు ఎన్యుమరేషన్ ఫారాలపై సమగ్ర సమాచారం అందించి వారి సందేహాలను నివృత్తి చేశారు. గ్రామ యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామస్థులకు ఫారాలు పూరించడంలో సహకరిస్తామని ప్రకటించడం అభినందనీయమని తహసీల్దార్ తెలిపారు. ఆలేరు మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ సర్వే పనులను తహసీల్దార్ పరిశీలించి, ఫారాల సేకరణ, నమోదు ప్రక్రియను తనిఖీ చేసి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల శిక్షకులు దూడల వెంకటేష్, ఏఎస్ఓ మహేష్, రాంప్రసాద్, స్వామి, సూపర్వైజర్లు, ఆయా గ్రామాల బీఎల్వోలు, ఉపాధ్యాయులు, కళాశాల విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# వానాకాలం సాగుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి:




కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

**కామారెడ్డి, జూలై 4**

వానాకాలం–2026 వ్యవసాయ సీజన్‌ను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయం, తాగునీరు, సాగునీరు, ప్రజారోగ్యం, విద్య, ఉద్యానవనం, ఆయిల్ పామ్ విస్తరణ, రైతు రిజిస్ట్రీ, సూక్ష్మ సాగునీరు, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలపై సీఎస్ సమీక్ష నిర్వహించారు. రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచడంతో పాటు నకిలీ విత్తనాలు, ఎరువుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు కంట్రోల్ రూమ్‌లు, ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను సిద్ధంగా ఉంచాలని, తాగునీటి నాణ్యత, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యతతో అమలు చేయాలని, ఫేషియల్ రికగ్నిషన్, డిజిటల్ డ్యాష్‌బోర్డ్ ద్వారా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ మాట్లాడుతూ రైతు రిజిస్ట్రీ నమోదును వేగవంతం చేయాలని, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, సీజనల్ వ్యాధుల నియంత్రణపై అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

## భద్రాద్రి గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి కీలక ముందడుగు

**ఖమ్మం, జూలై 4**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. జిల్లా యంత్రాంగం నిర్వహించిన సాధ్యాసాధ్యాల అధ్యయనంలో సీతంపేట, సుజాతనగర్ ప్రాంతాలు అనుకూలంగా గుర్తించగా, ఈ నివేదికను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రాంమోహన్ నాయుడుకు పంపించారు. ఏటీఆర్-72-600 తరహా విమానాలకు అనువుగా ఆరు ప్రాంతాలను పరిశీలించగా, సుమారు 667 ఎకరాల్లో విమానాశ్రయం అభివృద్ధికి సీతంపేట, సుజాతనగర్ ప్రాంతాలు సాంకేతిక, ఆర్థిక, పర్యావరణ పరంగా అనుకూలమని నివేదిక పేర్కొంది. మంత్రి తుమ్మల తన లేఖలో భద్రాద్రి జిల్లా పారిశ్రామిక, గిరిజన, పర్యాటక ప్రాధాన్యతను వివరించారు. సింగరేణి గనులు, హెవీ వాటర్ ప్లాంట్, ఐటీసీ వంటి పరిశ్రమలతో పాటు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు విమానాశ్రయం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఫీజిబిలిటీ నివేదికను పరిగణనలోకి తీసుకుని గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలపాలని కోరిన మంత్రి, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి..

- క్యూర్ పరిధిలో పేదలకు ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యం: మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, జూలై 4 .**

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి, ప్రభుత్వ ప్రాధాన్యతల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార–పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. శనివారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో క్యూర్ పరిధిలో అఫోర్డబుల్ ఎల్ఐజీ అర్బన్ హౌసింగ్ పథకం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల శాశ్వత భవనాల నిర్మాణంపై అధికారులతో చర్చించారు. మంత్రి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో విజయవంతమైన ఇందిరమ్మ ఇళ్ల పథకం తరహాలోనే క్యూర్ పరిధిలో పేదలకు అందుబాటు గృహాలు నిర్మించనున్నట్లు తెలిపారు. 26 నియోజకవర్గాల్లో తొలి దశలో ఒక్కో నియోజకవర్గంలో 500 ఇళ్ల చొప్పున నిర్మాణం చేపట్టి, టెండర్లను త్వరలో ఖరారు చేస్తామని చెప్పారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా భూముల గుర్తింపు, నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 10 ఆర్డీవో కార్యాలయాలు, 107 తహసీల్దార్ కార్యాలయాలు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన 2 డీఐజీ, 4 జిల్లా సబ్‌రిజిస్ట్రార్, 52 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఒకే నమూనాలో ఆధునిక శాశ్వత భవనాలు నిర్మిస్తున్నామని మంత్రి వెల్లడించారు. విద్యుత్ ఆదా, పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా సోలార్ పార్కింగ్ వంటి సదుపాయాలు కూడా కల్పిస్తామని తెలిపారు.

# విద్యార్థులు చట్టాలపై బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలి

- జిల్లా "షీ" టీమ్ పోలీసులు
- జాజాపూర్ గ్రామంలో విద్యార్థులకు పలు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం
- మహిళల భద్రత, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మాదకద్రవ్యాల నివారణపై సూచనలు
- జిల్లా ఎస్పీ డాక్టర్. వినిత్ ఐపీఎస్ అదేశాలమేరకు




**నారాయణపేట,జులై,04**

మహిళలు, బాలికల భద్రతతో పాటు విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో జిల్లా "షీ" టీమ్ పోలీసులు జాజాపూర్ గ్రామంలోని విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా "షీ"టీమ్ పోలీసులు బాలరాజు, చెన్నప్ప లు మాట్లాడుతూ... విద్యార్థులు తమ విద్యతో పాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలు, చట్టాలు, భద్రతా అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాలికలు ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని తెలిపారు.మహిళలు, బాలికల రక్షణ కోసం తెలంగాణ పోలీసు శాఖ ఏర్పాటు చేసిన "షీ" టీమ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈవ్‌టీజింగ్, వేధింపులు, సోషల్ మీడియాలో అసభ్యకర సందేశాలు, నకిలీ సోషల్ మీడియా ఖాతాల ద్వారా జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించకూడదని వివరించారు. ఏదైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడం లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.అలాగే మాదకద్రవ్యాలు, గంజాయి, మద్యం వంటి వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, పిల్లలపై జరిగే నేరాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం ప్రాణాలను కాపాడుతుందని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సేవల కోసం డయల్ 100/112, మహిళల భద్రత కోసం "షీ" టీమ్, సైబర్ మోసాల కోసం 1930 హెల్ప్‌లైన్ సేవలను వినియోగించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో "షి" టీమ్ పోలీసులు జ్యోతి, కవిత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజస్థాన్‌లో రూ.1.06 లక్షల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

**బాలోత్రా జూలై4 .**

బాలోత్రాలో పలు ప్రాజెక్టులను జాతికి అంకితం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ/బాలోత్రా, జూలై 4: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం రాజస్థాన్‌లోని బాలోత్రాలో సుమారు రూ.1.06 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను జాతికి అంకితం చేసి, ప్రారంభించి, శంకుస్థాపన చేశారు. విమానయానం, ఇంధనం, రవాణా, తాగునీరు, మెట్రో, పునరుత్పాదక ఇంధనం వంటి కీలక రంగాలకు సంబంధించిన ఈ ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి కొత్త ఊపునిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా రాజస్థాన్ రిఫైనరీని జాతికి అంకితం చేసిన ప్రధాని, ఇది వేలాది మందికి ఉపాధి కల్పించడంతో పాటు దేశ ఇంధన స్వావలంబనకు కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. జోధ్‌పూర్‌లో నూతన విమానాశ్రయ టెర్మినల్ ప్రారంభించడంతో మార్వార్ ప్రాంతంలో పర్యాటకం, వాణిజ్యం, ఉపాధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు. జైపూర్ మెట్రో రెండో దశ పనులకు కూడా శ్రీకారం చుట్టారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచం తీవ్ర ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొన్నప్పటికీ, భారత్ సరైన నిర్ణయాలు, సమర్థవంతమైన దౌత్యం, దేశీయ వనరుల వినియోగంతో సంక్షోభాన్ని విజయవంతంగా అధిగమించిందని ప్రధాని తెలిపారు. ఎల్పీజీ ఉత్పత్తిని పెంచడం, పీఎన్‌జీ కనెక్షన్ల విస్తరణ, సిలిండర్ ధరలను నియంత్రించడం, పెట్రోల్–డీజిల్ సరఫరాలో అంతరాయం రాకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు. ఉక్రెయిన్ యుద్ధం సమయంలో ఎరువుల కొరత ఏర్పడినప్పటికీ, భారీ సబ్సిడీలతో రైతులకు తక్కువ ధరలో యూరియా అందించామని, చిన్న పరిశ్రమలను రక్షించేందుకు అత్యవసర రుణ హామీ పథకాన్ని విస్తరించామని పేర్కొన్నారు. శేఖావాటి ప్రాంత తాగునీటి సమస్య పరిష్కారానికి రాజస్థాన్–హర్యానా మధ్య రూ.34 వేల కోట్ల ఒప్పందం కుదిరిందని, హత్నికుండ్ బ్యారేజ్ నుంచి భూగర్భ పైప్‌లైన్ ద్వారా సికర్, చురు, ఝున్‌ఝును తదితర ప్రాంతాలకు నీరు అందిస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఖేజ్రీ మొక్కను నాటిన ప్రధాని, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల ద్వారా సౌరశక్తి వినియోగం వేగంగా విస్తరిస్తోందని చెప్పారు. రాజస్థాన్‌లో ఆధునిక మౌలిక సదుపాయాల నిర్మాణం వేగంగా కొనసాగుతోందని, ప్రజల సహకారంతో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు.

## రీజినల్ ట్రైనింగ్ మేనేజర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**సంగారెడ్డి, జూలై 4**

హైదరాబాద్ లోని డా. ఎం.సి.ఆర్. హెచ్.ఆర్.డి.ఐ.టీ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా శిక్షణ కేంద్రంలో కన్సల్టెన్సీ ప్రాతిపదికన రీజినల్ ట్రైనింగ్ మేనేజర్ పోస్టును భర్తీ చేయనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి పాండు తెలిపారు. ఈ పోస్టుకు ఎంపికైన అభ్యర్థికి నెలకు రూ.30,000 పారితోషికం అందజేయనున్నారు. ఇటీవల ఆర్ డీవో, పీడీ–డీఆర్ డీఓ లేదా డిప్యూటీ డైరెక్టర్ కేడర్ లో పదవీ విరమణ పొందిన, సంగారెడ్డి జిల్లాలో శాశ్వత నివాసం ఉంటున్న అధికారులు దరఖాస్తుకు అర్హులు. కేడర్ లో పదవీ విరమణ పొందిన, సంగారెడ్డి జిల్లాలో శాశ్వత నివాసం ఉంటున్న అధికారులు దరఖాస్తుకు అర్హులు. బోధన, శిక్షణ కార్యక్రమాలపై ఆసక్తి, మచ్చలేని సేవా రికార్డు, కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జూలై 8లోపు తమ దరఖాస్తులను అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, కలెక్టరేట్, సంగారెడ్డి కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9849904284 నంబర్ ను సంప్రదించవచ్చని తెలిపారు.

# సనంద్‌లో సీజీ సెమీ ఓసాట్ కేంద్రాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ

**గుజరాత్ జూలై4**

గుజరాత్‌లోని సనంద్‌లో సీజీ సెమీ అవుట్‌సోర్స్డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్ (ఓసాట్) కేంద్రాన్ని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా భారత సెమీకండక్టర్ రంగంలో ఇది చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రధాని మాట్లాడుతూ, భారత్‌లో సెమీకండక్టర్ పరిశ్రమ వేగంగా విస్తరిస్తోందని, "అడుగు అడుగుగా, ఇటుక ఇటుకగా, చిప్ చిప్‌గా" దేశం స్వావలంబన దిశగా ముందుకు సాగుతోందన్నారు. గత దశాబ్దంలో ఎలక్ట్రానిక్స్ తయారీలో సాధించిన విజయాల ఫలితంగానే ఇప్పుడు చిప్ తయారీ రంగంలో భారత్ ముందడుగు వేసిందని చెప్పారు. దేశంలో ఉత్పత్తుల తయారీ నుంచి భాగాల తయారీ, ఇప్పుడు సెమీకండక్టర్ల తయారీ వరకు పూర్తి ఎలక్ట్రానిక్స్ విలువ శ్రేణిని నిర్మిస్తున్నామని, ఇదే "మేక్ ఇన్ ఇండియా" తదుపరి దశ అని ప్రధాని వివరించారు. చిప్ రూపకల్పన నుంచి తయారీ, ప్యాకేజింగ్ వరకు పూర్తి సెమీకండక్టర్ పర్యావరణ వ్యవస్థను భారత్‌లోనే ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భారత్ యువత తయారు చేసిన చిప్‌లతో కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్ తదితర భవిష్యత్ సాంకేతిక విప్లవాలకు నాయకత్వం వహిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కేంద్రం ద్వారా ప్రస్తుతం ఏడాదికి 20 కోట్ల చిప్‌ల ప్యాకేజింగ్ సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని, త్వరలోనే దీనిని 500 కోట్ల యూనిట్ల వార్షిక సామర్థ్యానికి విస్తరించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. సనంద్‌ను ప్రపంచస్థాయి సెమీకండక్టర్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

# దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శం

కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, జూలై 4 .**

తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, విముక్తి కోసం అలుపెరగని పోరాటం చేశారని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం నింపి తెలంగాణ సాయుధ ఉద్యమాన్ని బలోపేతం చేసిన మహనీయుడిగా దొడ్డి కొమురయ్యను కొనియాడారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చేసిన త్యాగం యువతకు స్ఫూర్తిదాయకమని, స్వాతంత్ర్యం, ప్రజల సంక్షేమం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు.

## తెలంగాణను దేశంలో అగ్రగామిగా నిలపాలి: సీఎస్ సంజయ్ జాజు

**హైదరాబాద్, జూలై 4:**

రాష్ట్ర, జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి జిల్లా స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళ్లి తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలపాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లకు సూచించారు. వ్యవసాయం, తాగునీరు, ఆరోగ్యం, సాగునీరు, విద్య, వాతావరణ పరిస్థితులపై శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా, అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి పాల్గొన్నారు. చిన్న జిల్లాల్లో పరిపాలన మరింత సమర్థవంతంగా సాగుతుందని, వచ్చే ఆరు నెలల్లో రాష్ట్రంలో గణనీయమైన మార్పు తీసుకురావాలని సీఎస్ అన్నారు. రైతులకు తెలుగు భాషలో వ్యవసాయ సూచనలు, వాతావరణ హెచ్చరికలు ఎస్ఎంఎస్‌ల ద్వారా పంపించాలని, యూరియా సకాలంలో అందించి దుర్వినియోగాన్ని అరికట్టాలని ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటలు, ఆయిల్‌పామ్, కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డే, యాంటీ లార్వా కార్యక్రమాలు నిర్వహించాలని, గురుకులాలు, వసతి గృహాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని, పైప్‌లైన్ లీకేజీలను వెంటనే నివారించాలని సూచించిన సీఎస్, జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన వీబీజీఆర్ఏఎంజీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. అలాగే మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతిరోజూ లబ్ధిదారుల వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో డాక్టర్ నారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డీఐఓ డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి: ఎంపీ గోడం నగేశ్




**ఆదిలాబాద్, జూలై 4**

జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలును వేగవంతం చేసి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందించాలని ఎంపీ గోడం నగేశ్ అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో ఎంపీ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో వివిధ శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలు, భౌతిక–ఆర్థిక పురోగతి, పెండింగ్ పనులపై సమీక్ష నిర్వహించారు. కేంద్ర నిధులతో చేపడుతున్న పనులను వేగంగా పూర్తి చేయాలని, గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం, ఆరోగ్య సేవలు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, అల్పాహార కార్యక్రమాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీ సూచించారు. ఉపాధి హామీ పనులు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు, బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్లు, అటవీ ప్రాంతాల్లో సోలార్ విద్యుత్, రేషన్ బియ్యం పంపిణీ పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఉపాధి హామీ పనుల్లో సమాన పనిదినాలు, సమాన వేతనం అమలు చేయాలని, యూరియా సరఫరా సమస్యలు లేకుండా చూడాలని, ఇందిరమ్మ ఇండ్లకు అటవీ అనుమతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. జాతీయ రహదారులపై ప్రమాదకర ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.

## సానంద్‌లో సెమీకండక్టర్ ఓసాట్ యూనిట్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, జూలై 4**

దేశ సెమీకండక్టర్ రంగానికి కీలక మైలురాయిగా గుజరాత్‌లోని సానంద్‌లో సీజీ సెమీ ఓసాట్ (ఔట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్) కేంద్రాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, "డిజైన్ ఇన్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా" లక్ష్యాలతో దేశంలో పూర్తి స్థాయి సెమీకండక్టర్ పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తున్నామని తెలిపారు. చిప్ రూపకల్పన నుంచి తయారీ, ప్యాకేజింగ్ వరకు మొత్తం విలువ గొలుసును దేశంలోనే అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సానంద్‌లో ప్రారంభమైన ఈ యూనిట్ ప్రస్తుతం ఏటా 20 కోట్ల చిప్‌ల ప్యాకేజింగ్ సామర్థ్యం కలిగి ఉండగా, భవిష్యత్తులో దాన్ని 500 కోట్ల చిప్‌లకు పెంచే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. గత పదేళ్లలో భారత్‌లో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం విస్తృతంగా అభివృద్ధి చెందిందని, మొబైల్ ఫోన్ తయారీలో ప్రపంచంలోనే రెండో అతిపెద్ద దేశంగా భారత్ ఎదిగిందన్నారు. ఇప్పుడు ఉత్పత్తుల తయారీ నుంచి కీలక భాగాలైన సెమీకండక్టర్ల తయారీ దిశగా దేశం అడుగులు వేస్తోందని చెప్పారు. కృత్రిమ మేధ, రోబోటిక్స్, తదుపరి తరం సాంకేతిక రంగాల్లో "మేడ్ ఇన్ ఇండియా" చిప్‌లు కీలక పాత్ర పోషిస్తాయని, యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. అలాగే, ఈ రంగం పరిశోధన, రూపకల్పన, తయారీ, సరఫరా వ్యవస్థల్లో భారీ ఉపాధి అవకాశాలను సృష్టించనుందని తెలిపారు. గిరిజన ప్రాంతాలకు చెందిన యువతులు సహా అనేక మంది భారతీయ యువత ఈ అత్యాధునిక చిప్ తయారీ ప్రక్రియలో భాగస్వాములు కావడం దేశానికి గర్వకారణమని ప్రధాని పేర్కొన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత లక్ష్య సాధనలో సెమీకండక్టర్ రంగం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## రైస్ మిల్లర్లకు రూ.18.27 కోట్ల బకాయిలపై నోటీసులు

**మహబూబాబాద్, జూలై 4**

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'మిషన్ K–100' కార్యక్రమంలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం కురవి, మహబూబాబాద్ మండలాల్లోని రైస్ మిల్లులను తనిఖీ చేశారు. రబీ 2022–23 వేలం ధాన్యం ఖర్చుల కింద జిల్లాలోని మిల్లర్ల నుంచి సుమారు రూ.90 కోట్లు రావాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.7 కోట్లు మాత్రమే వసూలైనట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో కురవి మండలం అయ్యగారిపల్లిలోని శ్రీ తిరుమల రైస్ ఇండస్ట్రీస్, మహబూబాబాద్ మండలం అనంతారం గ్రామంలోని శ్రీనివాస ఇండస్ట్రీస్ మిల్లులను తనిఖీ చేసి, చెల్లించాల్సిన మొత్తం రూ.18.27 కోట్ల బకాయిలపై నోటీసులు జారీ చేశారు.

చురకలు



## అమర్‌నాథ్ యాత్రికులకు లెఫ్టినెంట్ గవర్నర్ కీలక విజ్ఞప్తి



**జమ్మూ కాశ్మీర్ జూలై4**

శ్రీ అమర్‌నాథ్ యాత్ర–2026 నిర్వహణపై జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. యాత్రికుల రద్దీ, ట్రాఫిక్, భద్రత, వసతి, నమోదు ప్రక్రియ తదితర అంశాలను పరిశీలించారు చెల్లుబాటు అయ్యే నమోదు (రిజిస్ట్రేషన్) లేకుండా పెద్ద సంఖ్యలో యాత్రికులు రావడం వల్ల నిరీక్షణ సమయం పెరుగుతోందని అధికారులు తెలిపారు. కేటాయించిన తేదీకి చెల్లుబాటు అయ్యే నమోదు పత్రం ఉన్నవారికే పవిత్ర గుహకు వెళ్లేందుకు అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. నమోదు చేసుకోని యాత్రికులు కొన్ని రోజులు ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాలని, తప్పనిసరిగా యాత్ర అనుమతి పత్రం పొందిన తర్వాతే జమ్మూ కాశ్మీర్‌కు రావాలని లెఫ్టినెంట్ గవర్నర్ విజ్ఞప్తి చేశారు. యాత్ర భద్రత, నిర్వహణ కోసం అన్ని శాఖలు, భద్రతా బలగాలు, లంగర్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

## అదనపు కలెక్టర్ నగేష్‌కు ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ



**మెదక్, జూలై 4 .**

సమగ్ర ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్ ఐఆర్)లో భాగంగా మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ కు బీఎల్ వోలు ఎన్యుమరేషన్ పత్రాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అర్హుడిని ఓటరుగా నమోదు చేసేలా ప్రజల భాగస్వామ్యంతో పని చేయాలని, ముఖ్యంగా 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హవేలీ ఘనపూర్ తహసీల్దార్ సింధు రేణుకతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు 100 రోజుల ముందస్తు ప్రణాళిక



**కరీం నగర్ జూలై4 .**

రానున్న వానాకాలం ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు 100 రోజుల ముందస్తు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ సంచాలకులు శ్యాం ప్రసాద్ లాల్ తెలిపారు. కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, పౌరసరఫరాల శాఖ అధికారులు, జిల్లా మేనేజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత యాసంగిలో అధికారులు, మిల్లర్ల సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఈ వానాకాలంలో 80 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. అందుకు అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా 100 శాతం మిల్లింగ్ లక్ష్యాలు పూర్తి చేయాలని, అవసరమైతే మిల్లుల్లో పని గంటలు పెంచి నిరంతరాయంగా మిల్లింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి మిల్లుకు ఒక మానిటరింగ్ అధికారిని నియమించి, పౌరసరఫరాల శాఖ అధికారులు, తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో మిల్లింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

## ఆహార భద్రతపై సీఎస్ సంజయ్ జాజూ సమీక్ష

**హైదరాబాద్, జూలై 4:**

రాష్ట్రంలో ఆహార భద్రతా నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేసి, కల్తీ ఆహార పదార్థాలపై నిరంతర తనిఖీలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజూ అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డ్రగ్ కంట్రోలర్, ఫుడ్ సేఫ్టీ విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ ఆహార నాణ్యత ప్రమాణాల అమలును పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రెండు విభాగాల సమన్వయం కోసం వారం రోజుల్లో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేసి తెలంగాణలో కూడా అనుసరించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. రాష్ట్రంలో నమోదైన కేసులు, వాటి పురోగతి, సిబ్బంది తదితర అంశాలపై సమావేశంలో సమీక్షించారు. సమావేశంలో సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు, డీజీపీ సి.వి. ఆనంద్, సీఎంఓ, జీఏడీ ప్రిన్సిపాల్ సెక్రెటరీ అహ్మద్ నదీమ్ వైద్యశాఖ, జీహెచ్ఎంసీ, డ్రగ్ కంట్రోల్ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు..

## "సురక్షా మిత్ర" కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల జడ్పీహెచ్ఎస్ లో అవగాహన కార్యక్రమం

**బొంరాస్‌పేట్ మండలం,జూలై 04**




మహిళలు, చిన్నారుల భద్రతలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ చేపట్టిన "సురక్షా మిత్ర" కార్యక్రమంలో భాగంగా నేడు బొంరాస్‌పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ZPHS)లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎస్సై బొంరాస్‌పేట్ జి.బి.వి. రమణ పోలీస్ సిబ్బందితో కలిసి పాల్గొని, సురక్షా మిత్ర వాలంటీర్లతో ప్రత్యక్షంగా సమావేశమై వారి బాధ్యతలు, మహిళలు మరియు చిన్నారుల రక్షణలో వారి పాత్ర గురించి వివరించారు. సమాజంలో మహిళలు, బాలికలు, చిన్నారులపై జరిగే నేరాలను అరికట్టేందుకు పోలీసులతో సమన్వయంగా పనిచేయాలని సూచించారు.అలాగే, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులకు సమాచారం అందించడం, బాధితులకు ధైర్యం చెప్పడం, చట్టపరమైన సహాయం అందేలా సహకరించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు సంబంధించిన ప్రతి విషయంలో బొంరాస్‌పేట్ పోలీసులు పూర్తి సహకారం అందిస్తారని, సురక్షా మిత్ర వాలంటీర్లతో సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తామని ఎస్ఐ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సురక్షా మిత్ర వాలంటీర్లు, విద్యార్థులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వికారాబాద్ సురక్ష మిత్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సైబర్ భద్రతపై విస్తృత అవగాహన

### వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,IPS.

**వికారాబాద్, జులై,04**



మహిళలు, చిన్నారుల భద్రతతో పాటు సమాజంలో భద్రతా చైతన్యం పెంపొందించేందుకు వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS వినూత్న కార్యక్రమాలలో భాగంగా నిర్వహిస్తున్న "వికారాబాద్ సురక్ష మిత్ర" కార్యక్రమం కింద నేటి నుండి 10.07.2026 వరకు మొదలైన “సైబర్ అవేర్నెస్ వీక్” లో భాగంగా జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, వి.పి.ఓ (Village Police Officers) తమ తమ గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను సందర్శించి 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఇంటర్నెట్‌ను సురక్షితంగా వినియోగించే పద్ధతులు, బలమైన పాస్‌వర్డ్‌ల వినియోగం, వ్యక్తిగత వివరాలు, ఫోన్ నంబర్లు, OTPలు, పాస్‌వర్డ్‌లు, పాఠశాల వివరాలు ఇతరులతో పంచుకోకూడదని సూచించారు.అదేవిధంగా సోషల్ మీడియాలో అపరిచితుల ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను అంగీకరించకూడదని, ఫేక్ ప్రొఫైల్‌లు, సైబర్ బులీయింగ్, ఆన్‌లైన్ గేమింగ్ మోసాలు, ఫిషింగ్ లింకులు, బహుమతుల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వివరించారు. విద్యార్థులు ఏదైనా అనుమానాస్పద సందేశం, అవమానకరమైన పోస్టు లేదా సైబర్ వేధింపులను ఎదుర్కొంటే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అలాగే సోషల్ మీడియాలో వచ్చే వార్తలను ధృవీకరించకుండా ఇతరులకు ఫార్వర్డ్ చేయరాదని అవగాహన కల్పించారు.భారత ప్రభుత్వ National Cyber Crime Helpline – 1930, Child Helpline – 1098, Emergency Response Support System – 112 మరియు www.cybercrime.gov.in ద్వారా సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయవచ్చని విద్యార్థులకు తెలియజేశారు.ఈ సందర్భంగా విద్యార్థులతో "My Cyber Safety Pledge" చేయించి, తమ వ్యక్తిగత సమాచారాన్ని రక్షించుకోవడం, బాధ్యతా యుతమైన డిజిటల్ పౌరులుగా వ్యవహరించడం, అనుమానాస్పద ఆన్‌లైన్ కార్యకలాపాలను వెంటనే పెద్దలకు తెలియజేయడం వంటి అంశాలపై ప్రతిజ్ఞ చేయించారు.జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో పిల్లలకు సైబర్ భద్రతపై అవగాహన అత్యంత అవసరమని, ప్రతి విద్యార్థి సురక్షితమైన డిజిటల్ పౌరుడిగా ఎదగాలనే లక్ష్యంతో "వికారాబాద్ సురక్ష మిత్ర" కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలపై పర్యవేక్షణ వహించి సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని కల్పించాలని కోరారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS ఆదేశాల మేరకు, "సురక్ష మిత్ర" మరియు "సైబర్ అవేర్నెస్ వీక్" లో భాగంగా జిల్లా పాఠశాలలు, కేజీబీవీ కళాశాలల్లో విద్యార్థులకు సైబర్ నేరాలు, పోక్సో చట్టం, డ్రగ్స్ నిర్మూలన, మహిళల భద్రత మరియు రోడ్డు నిబంధనలపై పోలీస్ అధికారులు విస్తృత అవగాహన కల్పించారు.

## దేశంలోనే తొలి సోలార్ మోడల్ మండలంగా కొడంగల్

- **సమష్టి సహకారంతో నెల రోజుల్లో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటు పూర్తి చేయాలి:**
- **టీజీ రెడ్కో వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ ఎం.డి. ముషారఫ్ అలీ ఫరూఖీ, ఐఏఎస్.**

**కొడంగల్ మున్సిపల్, జులై,04**




దేశంలోనే తొలి సోలార్ మోడల్ మండలంగా కొడంగల్‌ను తీర్చిదిద్దే ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, వెండర్లు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని టీజీ రెడ్కో వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ ఎం.డి. ముషారఫ్ అలీ ఫరూఖీ, ఐఏఎస్ పిలుపునిచ్చారు. కొడంగల్ కాడా కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమ పురోగతిని సమీక్షించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి,కాడా స్పెషల్ ఆఫీసర్ వెంకటరెడ్డి, మున్సిపల్ చైర్మన్, టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శ్రీ నర్సిములు, టీజీ రెడ్కో జనరల్ మేనేజర్ శ్రీ జి.ఎస్.వి. ప్రసాద్, సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, పంచాయతీరాజ్, డిస్కం, టీజీ రెడ్కో అధికారులు, వెండర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముషారఫ్ అలీ ఫరూఖీ, ఐఏఎస్ మాట్లాడుతూ, ప్రస్తుతం దేశంలో మోడల్ సోలార్ విలేజ్‌లు మాత్రమే అమలులో ఉన్నాయని, ఒక సంపూర్ణ మండలాన్ని సోలార్ మోడల్ మండలంగా అభివృద్ధి చేసే కార్యక్రమం దేశంలోనే తొలిసారిగా కొడంగల్‌లో అమలవుతుండటం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే కొడంగల్ దేశ వ్యాప్తంగా ఆదర్శ మండలంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కొడంగల్ మండలంలో గృహజ్యోతి పథకం కింద ఉన్న 5,186 విద్యుత్ సర్వీసులకు రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిలో 2,418 సర్వీసులు సాంకేతికంగా అనుకూలంగా గుర్తించగా, ఇప్పటికే సుమారు 2,000 సోలార్ వ్యవస్థల ఏర్పాటు పూర్తయిందని, మిగిలిన పనులను కూడా రాబోయే నెల రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ పనులను మి/స్ క్లారో ఎనర్జీ లిమిటెడ్ మరియు మి/స్ హిందుస్తాన్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థలు చేపడుతున్నాయని తెలిపారు. సోలార్ మోడల్ మండలం లక్ష్యాన్ని నిర్ణీత గడువులోగా సాధించాలంటే సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధుల సహకారం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడం, అర్హులైన లబ్ధిదారులను ప్రోత్సహించడం, స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించడం ద్వారా కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయవచ్చని అన్నారు.సమీక్ష సమావేశంలో పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లో జరుగుతున్న పనుల వివరాలు, లబ్ధిదారుల జాబితా తమకు అందుబాటులో లేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై స్పందించిన టీజీ రెడ్కో వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ వెంటనే టీజీ రెడ్కో అధికారులు, సంబంధిత వెండర్లకు ఆదేశాలు జారీ చేస్తూ, ప్రతి గ్రామానికి సంబంధించిన లబ్ధిదారుల జాబితాను కాడా అధికారుల ద్వారా ఆయా సర్పంచులకు అందజేయాలని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులతో పంచుకోవాలని సూచించారు. అదేవిధంగా వెండర్లు నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా, సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా మౌంటింగ్ స్ట్రక్చర్లకు సరైన గ్రౌటింగ్, సమర్థవంతమైన ఎర్తింగ్, లైట్నింగ్ ప్రొటెక్షన్, నీడలేని ప్రదేశాల్లో సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. టీజీఎస్పీడీసీఎల్ అధికారులు నెట్ మీటర్ల ఏర్పాటు, గ్రిడ్ సింక్రొనైజేషన్ ప్రక్రియలను వేగవంతం చేసి లబ్ధిదారులు త్వరితగతిన సోలార్ విద్యుత్ ప్రయోజనాలు పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఎం.డి. ముషారఫ్ అలీ ఫరూఖీ, ఐఏఎస్, జిల్లా కలెక్టర్ మరియు ఇతర అధికారులు ఇప్పటికే ఏర్పాటు చేసిన రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన పనులను కూడా నిర్ణీత గడువులో పూర్తి చేసి, కొడంగల్‌ను దేశంలోనే తొలి సోలార్ మోడల్ మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగా సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, కాడా స్పెషల్ ఆఫీసర్ వెంకటరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్,తహసిల్దార్ రాంబాబు,మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్,మున్సిపల్ వైస్ చెర్మెన్ శంకర్ నాయక్, టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ నర్సిములు, టీజీ రెడ్కో జనరల్ మేనేజర్ జి.ఎస్.వి. ప్రసాద్, టీజీ రెడ్కో అధికారులు, రెవెన్యూ, పంచాయతీరాజ్, డిస్కం అధికారులు, సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వెండర్లు పాల్గొన్నారు.

## మీసేవలో ఎస్ఎస్‌సీ ఈ-మెమో అందుబాటు లో ప్రింట్ సేవ

**ములుగు, జూలై 4 .**

ఎస్ఎస్‌సీ మార్కుల మెమోను కోల్పోయిన విద్యార్థులకు మీసేవ కేంద్రాల ద్వారా SSC e-Memo ప్రింట్ సౌకర్యాన్ని తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ సామాజి దేవేందర్ తెలిపారు. 2004 సంవత్సరం నుంచి ఎస్ఎస్‌సీ పూర్తి చేసిన విద్యార్థులు తమ హాల్‌టికెట్ నంబర్, పరీక్ష సంవత్సరం వివరాలతో రాష్ట్రంలోని ఏ మీసేవ కేంద్రంలోనైనా అధికారిక ఈ–మెమోను పొందవచ్చన్నారు. ఈ సేవకు ప్రభుత్వం నిర్ణయించిన రూ.62 సేవా రుసుము చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ములుగు జిల్లా ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ



## నేడు రావూరి భరద్వాజ జయంతి

ప్రతిష్టాత్మకమైన జ్ఞానపీఠ్ అవార్డు పొందిన మూడో తెలుగు రచయిత రావూరి భరద్వాజ. ఆయన కన్నా ముందు ఈ అవార్డు కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణకు, డాక్టర్ సి. నారాయణరెడ్డికి ఈ అవార్డు లభించింది. భరద్వాజ 2011లో త్రిపురనేని గోపీచంద్ పురస్కారాన్ని, 2009లో లోక్‌నాయక్ పౌండేషన్ సాహిత్య పురస్కారాన్ని, 2012లో జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్నారు. రావూరి భరద్వాజ (జూలై 5, 1927 – (అక్టోబరు 18, 2013) తెలుగు లఘు కథా రచయిత, నవలా రచయిత, రేడియోలో రచయితగా పేరు తెచ్చుకున్నారు. గొప్ప భావుకుడైన తెలుగు కవి, రచయిత. రావూరి భరద్వాజ 37 కథా సంపుటాలు, 17 నవలలు, 6 బాలల మినీ నవలలు, 5 బాలల కథా సంపుటాలు, 3 వ్యాస, ఆత్మకథా సంపుటాలు, 8 నాటికలు, ఐదు రేడియో కథానికలు రచించారు. ఈయన బాల సాహిత్యంలో కూడా విశేషకృషి సలిపాడు. సినీ పరిశ్రమలో తెరవెనుక జీవితాన్ని కళ్లకు కట్టినట్టు చిత్రీకరించిన పాకుడు రాళ్ళు నవల భరద్వాజ యొక్క ఉత్కృష్ట రచనగా పరిగణింప బడుతుంది. ఈయన రచనలలో జీవన సమరం మరో ప్రముఖ రచన. తెలుగు రచనా ప్రపంచంలో వినూత్న సాహితీ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఘనుడాయన. ఆడంబరాలు లేని సాధారణ జీవితం ఆయనది. భరద్వాజకు దిగువ మధ్యతరగతి, పేదప్రజల భాషపై గట్టిపట్టు ఉంది. ఒక బీద కుటుంబంలో జన్మించిన భరద్వాజ కేవలం ఉన్నత పాఠశాల స్థాయి వరకే చదువు కున్నారు. ఆ తరువాత కాయకష్టం చేసే జీవితాన్ని ప్రారంభించారు. చిన్నతనంలో పొలాల్లో గడిపిన భరద్వాజ వ్యవసాయ కూలీల కఠినమైన జీవన పరిస్థితులను గమనించే వారు. అప్పుడే పల్లె ప్రజల భాష, యాస, ఆవేశాలు, ఆలోచనలు, కోపాలు, తాపాలు గమనించిన భరద్వాజ ఆ అనుభవాలను తర్వాత కాలంలో తన రచనలలో నిజమైన పల్లె వాతావరణాన్ని సృష్టించడానికి ఉపయోగించు కున్నారు. 2013 అక్టోబరు 18న రావూరి భరద్వాజ తిరిగిరాని లోకాలకు తరలి వెళ్ళారు. రావూరి 1927 జూలై 5వ తేదీన కృష్ణా జిల్లా లోని నందిగామ తాలూకా కంచికచర్ల సమీపం లోని మోగులూరు (నాటి హైదరాబాదు సంస్థానంలోని) గ్రామంలో రావూరి కోటయ్య, మల్లికాంబ దంపతులకు జన్మించారు. ఆయన విద్యాభ్యాసం 8వ తరగతి వరకే సాగింది. తొలి నాళ్ళలో రావూరి భరద్వాజపై చలం ప్రభావం ఎక్కువగా ఉండేది. యుక్త వయసులోనే తెనాలిచేరి అక్కడ ఒక ప్రెస్సులో పనిచేయటం ప్రారంభించారు. 1946లో నెల్లూరులోని జమీన్ రైతు వారపత్రిక సంపాదక వర్గంలో చేరారు. 1948లో దీనబంధు వారపత్రికకు బాధ్యులుగా ఉన్నారు. జ్యోతి,సమీక్ష, అభిసారిక, చిత్రసీమ, సినిమా, యువ పత్రికల్లో 1959వరకు కొన్నాళ్ళు ఫౌంటెన్ పెన్నుల కంపెనీలో సేల్స్‌మన్‌గా పని చేశారు. అక్కడ యజమాని అమానుషత్వాన్ని భరించలేక రాజీనామా చేసి కొన్నాళ్ళపాటు ఖాళీగా ఉన్నారు. ఆ తర్వాత హైదరాబాదు ఆకాశవాణి కేంద్రంలో 1959లో ప్రూఫ్ రీడింగ్ కళాకారునిగా చేరి చివరకు 1987లో ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా పదవీ విరమణ చేశారు. రావూరి భరద్వాజ గురించి చాలాకాలం పరిశోధన చేసి, రచనల గురించి సమగ్రమైన పరిశీలన చేసిన బొగ్గుల శ్రీనివాస్ ప్రకారం భరధ్వాజ సుమారు 187 పైగా పుస్తకాలను వెలువరించారు, 500 పైగా కథలను 37 సంకలనాలుగా, 19 నవలలు, 10 నాటకాలు వ్రాశారు. భరద్వాజ తన తొలి కథ ఒకప్పుడును 16 ఏళ్ల ప్రాయంలో వ్రాశారు. ఇది జానపద శైలిలోసాగే కథ. భరద్వాజపై చలం ప్రభావం మెండుగా ఉంది. చలాన్ని అనుకరిస్తూ ఈయన అనేక సెక్సు కథలు వ్రాశారు. త్వరలోనే సెక్సు కథలు వ్రాయటంలో అందెవేసిన చెయ్యి అనిపించు కున్నారు. అనేక పత్రికలు ఆ వ్యాసంగంలో ఈయన్ను ప్రోత్సహించాయి. ఏ మాత్రం సంకోచం, జంకు లేకుండా జీవనోపాధికై ఆయన అనేక కథలు వ్రాశారు. 1983లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును పొందారు. నాలోని నీవు, అంతరంగిణి, ఒక ఏకాంతం, ఒకింత వేకువ కోసం వంటి కవితా సంకలనాలు రచించారు. భరద్వాజ రచించిన కౌముది, హిందీ, గుజరాతీ భాషల్లోకి అనువాదమైంది. ఆత్మగతం, బానుమతి, దూరపు కొండలు, జీవనాడి, మనోరత్నం, నీరు లేని నది, సశేషం, స్వప్న సీమలు, స్వర్ణ మంజరి వంటి 11 నాటకాలు రచించారు. బాల సాహిత్యానికి సంబంధించి 33 పుస్తకాలు రచించారు. పిల్లల కోసం ఏడు నవలలు రాశారు. విచిత్రమైన మానవ భావోద్వేగాలే ప్రధానాంశాలుగా కథలు వ్రాసే భరద్వాజ శైలి సరళమైనది. పాత్ర చిత్రీకరణలో, ఒక సన్నివేశాన్ని పరిచయం చేయటంలో రావూరి భరద్వాజకు ఉన్న ప్రజ్ఞ అద్భుతమైనది. రావూరి భరద్వాజ పేరు ప్రఖ్యాతులు తెచ్చిన రచనల్లో ముఖ్యమైనది, చలనచిత్ర పరిశ్రమను వస్తువుగా చేసుకొని తెలుగులో వెలువడిన మొట్ట మొదటి నవల పాకుడు రాళ్లు. భరద్వాజ దీనికి మాయ జలతారు అని నామకరణం చేశారు. అయితే శీలా వీర్రాజు పాకుడురాళ్లు అనే పేరు పెట్టాడు. మల్లంపల్లి సోమశేఖర శర్మ, ముదిగొండ సుబ్రహ్మణ్య శర్మల ప్రోత్సాహంతో రావూరి భరద్వాజ తాను అంతకు ముందే రాసిన 'పాలపుంత' అనే ఓ పెద్ద కథని పాకుడురాళ్లు నవలగా రాశారు. మూడు సంవత్సరాల పాటు కృష్ణా పత్రికలో ధారా వాహికగా వెలువడిన పాకుడురాళ్లు నవలపై శ్రీకృష్ణదేవ రాయ, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయాల్లో పరిశోధనలు జరగడం విశేషం. రావూరి భరద్వాజకు 1980లో ఆంధ్ర విశ్వ విద్యాలయం, 1987లో జవర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం, 1991లో నాగార్జున విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేసి గౌరవించాయి. 1980లో కళాప్రపూర్ణ – ఆంధ్ర విశ్వవిద్యాలయం,1983లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, 1985లో సోవియట్ భూమి నెహ్రూ పురస్కారం ఇనుక తెర వెనకకు లభించింది. 1987లో రాజాలక్ష్మీ ఫౌండేషన్ అవార్డు,1987లో తెలుగు కళాసమితి కె.వి.రావు, జ్యోతిరావు అవార్డు, 1997లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాహిత్యలో విశిష్ట పురస్కారం, 2007లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళారత్న అవార్డు, 2008లో లోక్ నాయక్ ఫౌండేషన్ పురస్కారం, (వినూత్న సాహితీ ప్రక్రియ కల్పించినందుకు, డిసెంబరు 4 వ తేదీన ప్రకటించారు), 2011లో కేంద్ర సాహిత్య అకాడమీ, వంగూరి ఫౌండేషన్, గోపీచంద్ జాతీయ సాహిత్య పురస్కారాలు లభించాయి. 2012లో జ్ఞానపీఠ అవార్డు తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన బహుముఖమైన కృషికి దక్కింది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ప్రపంచ వార్తా విప్లవానికి బీబీసీ బాటలు

దృశ్య వార్తలకు నాంది పలికిన చారిత్రక ఘట్టం

నేడు తొలి సారిగా టెలివిజన్ వార్తా ప్రసారాన్ని ప్రారంభించిన దినం




ప్రపంచ మీడియా చరిత్రలో 1954 జూలై 5 ఒక మైలురాయిగా నిలిచిపోయిన రోజు. బ్రిటన్‌కు చెందిన బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బీబీసీ) తొలిసారిగా టెలివిజన్ వార్తా బులెటిన్‌ను ప్రసారం చేసి సమాచార రంగంలో కొత్త యుగానికి శ్రీకారం చుట్టింది. అప్పటివరకు వార్తలు పత్రికల్లో చదవడం, రేడియోలో వినడం మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉండగా, తొలిసారి సంఘటనలను కళ్లారా చూసే అవకాశం కల్పించడం ద్వారా టెలివిజన్ వార్తలు సమాచార ప్రసార విధానాన్ని పూర్తిగా మార్చేశాయి.

### రేడియో నుంచి టెలివిజన్ వరకు

1922లో రేడియో ప్రసార సంస్థగా ప్రారంభమైన బీబీసీ, నిష్పాక్షిక జర్నలిజానికి ప్రతీకగా ఎదిగింది. 1936లో టెలివిజన్ ప్రసారాలను ప్రారంభించినప్పటికీ రెండో ప్రపంచ యుద్ధం కారణంగా 1939లో వాటిని నిలిపివేయాల్సి వచ్చింది. యుద్ధానంతరం 1946లో తిరిగి ప్రసారాలు ప్రారంభించి, టెలివిజన్‌ను ప్రజల దైనందిన జీవితంలో భాగంగా మార్చింది.

### తొలి టెలివిజన్ వార్తా బులెటిన్

1954 జూలై 5న ప్రసారమైన తొలి టెలివిజన్ వార్తా కార్యక్రమానికి రిచర్డ్ బేకర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఆ రోజుల్లో సాంకేతిక పరిమితులు, ఉద్యోగ సంఘాల నిబంధనల కారణంగా వ్యాఖ్యాతలు తెరపై కనిపించకుండా, వార్తా చిత్రాలపై వాయిస్ ఓవర్ రూపంలో బులెటిన్‌ను అందించారు. 1955 నుంచి వ్యాఖ్యాతలు ప్రత్యక్షంగా స్టూడియోలో కూర్చొని వార్తలు చదివే విధానం ప్రారంభమైంది.

### వార్తలకు దృశ్యరూపం

టెలివిజన్ వార్తలతో ప్రజలు ప్రపంచంలో ఎక్కడ ఏమి జరుగుతుందో ప్రత్యక్షంగా చూసే అవకాశం పొందారు. ప్రభుత్వ విధానాలు, యుద్ధాలు, ప్రకృతి విపత్తులు, రాజకీయ పరిణామాలు, సామాజిక సంఘటనలపై ప్రజల్లో అవగాహన పెరిగింది. వార్తలు కేవలం సమాచారం మాత్రమే కాకుండా ప్రజాస్వామ్య చైతన్యానికి సాధనంగా మారాయి.

### ప్రపంచానికి ఆదర్శంగా బీబీసీ

1955లో ఐటీవీ పోటీగా వచ్చినా, బీబీసీ తన విశ్వసనీయతను నిలబెట్టుకుంది. తరువాత బీబీసీ--2, రంగుల ప్రసారాలు, ప్రత్యక్ష ప్రసారాలు, మల్టీ కెమెరా కవరేజ్, ఫీల్డ్ రిపోర్టింగ్ వంటి ఆధునిక విధానాలతో టెలివిజన్ జర్నలిజాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లింది.

### చరిత్రను ప్రపంచానికి చూపించిన బీబీసీ

జాన్ ఎఫ్. కెన్నెడీ హత్య, చంద్రునిపై తొలి అడుగు, బెర్లిన్ గోడ కూల్చివేత, 9/11 ఉగ్రదాడులు వంటి ఎన్నో చారిత్రక సంఘటనలను బీబీసీ ప్రపంచానికి ప్రత్యక్షంగా చూపించింది. వార్తలతో పాటు నేపథ్యం, విశ్లేషణ, ప్రజాభిప్రాయం, అంతర్జాతీయ ప్రభావాలను సమగ్రంగా అందించడం బీబీసీ ప్రత్యేకతగా నిలిచింది.

### భారత్‌లో టెలివిజన్ వార్తలకు ప్రేరణ

బీబీసీ చూపిన మార్గంలోనే అమెరికాలో సీబీఎస్, ఎన్బీసీ, ఏబీసీ వంటి సంస్థలు టెలివిజన్ వార్తలను విస్తరించాయి. భారతదేశంలో 1965లో టెలివిజన్ వార్తలు ప్రారంభమై, అనంతరం దూరదర్శన్ ద్వారా దేశవ్యాప్తంగా ప్రజలకు చేరాయి. తరువాత ప్రైవేట్ వార్తా చానళ్ల ఆవిర్భావంతో టెలివిజన్ జర్నలిజం మరింత విస్తరించింది.

### విలువలే బీబీసీ బలం

విశ్వసనీయత, నిష్పాక్షికత, ప్రజా ప్రయోజనం, సమాచార స్వేచ్ఛ వంటి విలువలను బీబీసీ తన వార్తా ప్రసారాల మూల సూత్రాలుగా నిలబెట్టింది. ఆధునిక సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా, జర్నలిజం విశ్వసనీయతే దాని అసలు బలం అని ప్రపంచానికి చాటి చెప్పింది.

### ముగింపు

1954 జూలై 5న ప్రారంభమైన బీబీసీ టెలివిజన్ వార్తా ప్రసారం కేవలం ఒక ప్రసార కార్యక్రమం కాదు. అది ప్రపంచ సమాచార వ్యవస్థను మార్చిన చారిత్రక ఘట్టం. నేటి డిజిటల్ మీడియా, ప్రత్యక్ష ప్రసారాలు, 24 గంటల వార్తా చానళ్లకు అది బలమైన పునాది. సాంకేతికత మారినా, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకునే నిష్పాక్షిక జర్నలిజమే మీడియా అసలైన శక్తి అని బీబీసీ చరిత్ర ఇప్పటికీ గుర్తు చేస్తూనే ఉంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# సేవానిరతికి ప్రతిరూపం కంచర్ల సుగుణమణి

## నేడు కంచర్ల సుగుణమణి వర్ధంతి

భారతదేశ చరిత్రలో మహిళా నేతలు పోషించిన పాత్ర విశిష్టమైనది. సంఘ సేవ చేసేవారు ఎంతో మంది ఉండవచ్చు. కాని సంఘ సేవే పరమావధి గా తమ జీవితాలను అంకితం చేసే వారు బహు అరుదుగా వుంటారు. ఆలాంటి త్యాగ మూర్తులలో అగ్ర భాగాన నిలుస్తారు కంచర్ల సుగుణమణి. ఆమె ప్రముఖ సంఘ సేవకురాలు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ కు అసలు సిసలైన అనుచరురాలిగా ఆమె సుప్రసిద్ధురాలు. ఆమె 1919, నవంబర్ 27వ తేదీన కాకినాడలో గురుజు వెంకటస్వామి, సూర్యనారాయణమ్మ దంపతులకు జన్మించారు. ఆ రోజులలోనే ఈమె మగపిల్లలతో సమానంగా మహారాజా కాలేజీలో డిగ్రీ చదివారు. చిన్నప్పటినుండి మంచి వాతావరణంలో పెరగడంవల్ల ఆమెకు సేవాభావం అలవడింది. ఆమె వివాహం గాంధేయవాది కంచర్ల భూషణంతో జరిగింది. ఆ రోజుల్లోనే కట్నకానుకలు వద్దని, చదువు, సంస్కారం వున్న అమ్మాయి కావాలని కంచర్ల భూషణం ఆమెను వివాహం చేసుకున్నారు.

ఆమె చదువుకునే రోజులలోనే భూకంపాలు, వరదలు, ఉప్పెనలు వచ్చినప్పుడు, ఇంటింటికీ వెళ్ళి విరాళాలు సేకరించి కాలేజీ యాజమాన్యానికి అప్పగించారు. తనలోని తపనను అక్షరాలతో పొదిగి గృహలక్ష్మి, భారతి వంటి పత్రికలకు వ్యాసాలు వ్రాసింది. స్త్రీ జనోద్ధరణ కోసం 1937లో లిటిల్ లేడీస్ ఆఫ్ బృందావన్ అనే సంస్థ ప్రారంభించారు. భర్త ఉద్యోగరీత్యా ఈమె ఢిల్లీ వెళ్ళారు. ఆకాశవాణిలో ఆమె తొలి తెలుగు ప్రసంగం ఢిల్లీ నుండి ప్రసారమయింది. 1944 సంవత్సరంలో భర్తకు బదిలీ కావడంతో మద్రాసుకు మకాం మార్చారు. భర్త ప్రోత్సాహంతో, ఆమె దుర్గాబాయమ్మను సందర్శించి ఆమెతో పాటుగా సేవ చెయ్యాలనే ఆకాంక్షను వెలిబుచ్చారు. దుర్గాబాయమ్మ దానికంగీకరించి ఆమెకు "ఆంధ్రమహిళ" పత్రిక పూర్తి బాధ్యతను అప్పగించింది. మద్రాసులో ఆమెకు బులుసు సాంబమూర్తి, భోగరాజు పట్టాభి సీతారామయ్య, టంగుటూరి ప్రకాశం పంతులు మొదలైన ప్రముఖుల సాంగత్యంతో ఆమె ఎన్నో విషయాలు తెలుసు కోగలిగారు. దుర్గాబాయమ్మ గారితో కలిసి "కస్తూరిబా నిధి"కి విరాళాలు ఒక సంవత్సరంలో 6 లక్షలు ప్రోగు చేశారు. ఆ రోజుల్లో 6 లక్షలంటే సామాన్యం కాదు. మహాత్మాగాంధి ఆజ్ఞ ప్రకారం దుర్గాబాయమ్మతో కలసి ఆ నిధితో ఆమె రాష్ట్రమంతా పర్యటించి, "కస్తూరిబా సేవా సంఘాలు" స్థాపించి అనుభవజ్ఞులైన సేవికలను ఏర్పాటు చేశారు. ఈనాటికీ అవి నిర్విరామంగా సేవలు చేస్తున్నాయంటే వాటి వెనుక ఆమె కృషి ఎంతో ఉంది.

భర్త ఉద్యోగరీత్యా అరకు వెళ్ళినప్పుడు అక్కడి గిరిజనుల పూరిళ్ళు, ఆహారం, భాష, కట్టుబాట్లు విచిత్రంగా వుండటం ఆమె గమనించారు. అక్కడి అనారోగ్యాలూ, విష జ్వరాలూ, కొండదేవతలకిచ్చే నరబలులు, జంతు బలులూ చూసి చలించి పోయి, మద్రాసులోని స్త్రీ శిశు సంక్షేమ అధికారి పారిజాతం నాయుడికి లేఖ రాశారు. ఆమె సహకారంతో ఒక సంక్షేమ కేంద్రాన్ని స్థాపించి, తమ కాలనీలోని స్త్రీల సహకారంతో పిల్లలకు చదువు,



ఆటపాటలు, కుట్లు, పారిశుధ్యం నేర్పుతూ సుగుణమణి ఐదు సంవత్సరాలు వారికి సేవ చేశారు. ఇప్పటికీ అక్కడ ఆ కేంద్రంలో స్త్రీలకు, పిల్లలకు చదువు, వృత్తివిద్యలు, ఆరోగ్య సూత్రాలు నేర్పుతున్నారు.

**1944 నుంచీ ఆలిండియా రేడియోలోనూ, టి.వి. వచ్చిన తరువాత అన్ని ఛానల్స్‌లోను ఎన్నో స్త్రీల సమస్యల గురించి తన నిశ్చితాభిప్రాయాలను వెలిబుచ్చుతూనే ఉండేవారు. శిశువుల నుంచీ వృద్ధుల దాకా స్త్రీలను ఆదుకోవాలనే ఆశయంతో సుందర్ నగర్‌లో వృద్ధాశ్రమం ఏర్పాటు చేశారు.**

ఆమె దుర్గాబాయమ్మ కోరిక మేరకు 1957 అక్టోబరులో హైదరాబాదు వచ్చి స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. "ఆంధ్ర మహిళాసభ" హైదరాబాద్ శాఖను అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్ ప్రారంభించారు. అప్పుడు విద్యానగర్‌లో ప్రారంభించిన "ఆంధ్ర మహిళాసభ" మెటర్నిటీ హాస్పిటల్, హేండీక్రాఫ్ట్స్ ఇన్‌స్టిట్యూట్, హైస్కూల్, హాస్టల్, అసెంబ్లీహాల్ లతో నిండిపోతే, ఉస్మానియా యూనివర్సిటీలో కూడా స్థలం తీసుకుని ఆర్ట్స్, సైన్స్, లా కాలేజీలు, కంప్యూటర్ కోర్స్, సంగీతం క్లాసులు, లిటరసీ భవన్, గాంధీభవన్, హాస్టల్, వికలాంగుల స్కూలు, ఫిజియోథెరపీ, నర్సింగు హాస్టల్ అలా ఎన్నో ఏర్పాటు చేశారు. 260 మంది పిల్లలు ఎన్నో వృత్తి విద్యలు నేర్చుకుంటున్నారు. "ఆంధ్ర మహిళాసభ" పెట్టిన కొత్తలో దుర్గాబాయమ్మతో కలిసి ఆమె ఇంటింటికీ తిరిగి బేడా, పావలా కూడా విరాళాలుగా సేకరించింది. అలా మొదలైన సేవ మరణించే వరకూ లక్షలలో విరాళాలు సేకరిస్తూ "ఆంధ్రమహిళాసభ"ను శాఖోప శాఖలుగా విస్తరిస్తూ, కొన్ని శాఖలకు కార్యదర్శిగా, సలహాదారుగా సేవలు చేస్తూ, 6 ఏళ్ళు అధ్యక్షురాలిగా సమర్ధ వంతంగా ఆ పదవిని నిర్వహించారు. దుర్గాబాయమ్మ మరణించాక 'ఆంధ్ర మహిళాసభ' పూర్తి బాధ్యతలను చేపట్టారు. ట్రస్ట్ బోర్డ్‌కి మరణించే వరకు తన సహాయ సహకారాలను అందించారు. ఆమె ఆధ్వర్యంలో దుర్గాబాయమ్మ సెంటినరీ సెలబ్రేషన్స్ చాలా ఘనంగా జరిగింది. మద్రాసు, హైదరాబాద్‌ల లోనే కాకుండా, కర్నూలు, సంగారెడ్డి, మహబూబ్ నగర్, ఇబ్రహీంపట్నం లలో కూడా ఆంధ్ర మహిళాసభ ఎంతో కృషి చేస్తున్నది. ఎడల్ట్ ఎడ్యుకేషన్ రూరల్ ఏరియాలలో లిటరసీ హౌస్ దక్షిణ భారతంలో "ఆంధ్ర మహిళాసభ"లో మాత్రమే వున్నది. వాలంటరీ సెక్టార్‌లో కాలేజ్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ ఇచ్చే మొదటి సంస్థ యిదే. ఇన్ని సంస్థలు దుర్గాబాయమ్మ తదనంతరం కూడా అంత ఘనంగానూ నడుస్తున్నా యంటే, అది ఆమె ఓర్పు, నేర్పు, సహనం, సమయపాలనల వల్లనే. "ఆంధ్ర మహిళ" పత్రిక పూర్తి బాధ్యత సుగుణమణి తీసుకున్నారు. అందులో కనుపర్తి వరలక్ష్మమ్మ, ఆచంట రుక్మిణమ్మ, కాంచనపల్లి కనకాంబ మొదలైన ఆనాటి ప్రముఖ రచయిత్రుల వ్యాసాలను ప్రచురించటమే కాదు, తనూ స్వయంగా వ్రాసి పత్రికను తీర్చిదిద్దారు. ప్రూఫులు దిద్దటం దగ్గరనుంచీ, స్టాంపులు అంటించి నడిచివెళ్ళి పోస్ట్ చెయ్యటం దాకా అన్ని బాధ్యతలూ ఈమే నిర్వర్తించే వారు. అటు 'ఆంధ్ర మహిళాసభ'లో స్త్రీ సంక్షేమంతో పాటుగా, యిటు 'బాలానంద సంఘం'లో శిశుబాలల సంక్షేమానికీ ఆమె అంకితమైనారు. 'బాలానంద సంఘం'లో మొదటి నుంచే ఉపాధ్యక్షురాలిగా ఆమె ఎంతో సేవ చేశారు. రేడియో అన్నయ్య న్యాయపతి రాఘవరావు, అక్కయ్య న్యాయపతి కామేశ్వరి దంపతులకు ఆమె ఎంతో ఆత్మీయురాలు. న్యాయపతి రాఘవరావు చనిపోయి తరువాత 1984 నుండి ఆమె బాలానంద సంఘం అధ్యక్షురాలిగా పనిచేసింది. ఆమె ఆధ్వర్యంలో "ఆంధ్ర బాలానంద సంఘం" 1990 సంవత్సరంలో స్వర్ణోత్సవాలను దిగ్విజయంగా జరుపుకున్నది. ప్రజా జీవితంలో ఎన్నో పదవులు ఆమెను వరించాయి. ఆంధ్ర మహిళా సభ కార్యదర్శి/సలహాదారు/అధ్యక్షురాలుగా, ఆంధ్ర బాలానంద సంఘం ఉపాధ్యక్షురాలు/అధ్యక్షురాలుగా, మద్రాస్ రాష్ట్ర సొసైటీ అడ్వయిజరీ బోర్డు సభ్యురాలుగా, వికలాంగుల సలహాబోర్డు సభ్యురాలుగా, కస్తూర్బా గాంధీ సేవాసంఘం ఉమెన్ కమిటీ కార్యదర్శిగా, శారదా సంఘం ఆంధ్రప్రదేశ్ ఛైర్‌పర్సన్ గా, ఉమ్మడి ఏపీ కార్మిక సంక్షేమ సలహా కమిటీ సభ్యురాలుగా వివిధ పదవులు చేపట్టి సేవలు అందించారు. 1991లో: చైల్డ్ వెల్ఫేర్‌కి గాను నేషనల్ అవార్డు అప్పటి ప్రెసిడెంట్ చేతుల మీదుగా, 1991లో శిరోమణి ఇన్‌స్టిట్యూట్, న్యూఢిల్లీ వారి చేత వికాసశ్రీ అవార్డు 1993 లో భరతముని కళా అవార్డు, 1994లో రాజీవ్‌రత్న నేషనల్ అవార్డు, 2000లో మిలీనియమ్ అవార్డు, 200లో రామకృష్ణ మఠ్ ద్వారా లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు, 2001లో ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే సందర్భంగా హైదరాబాద్ పెరల్ సిటీ జూనియర్ ఛాంబర్ వారిచె హైదరాబాద్ పెరల్ అవార్డు, 2002లో గాంధీగారి మనుమరాలు, తారాగాంధీ చటర్జీ ద్వారా సర్వోదయా సంస్థ అవార్డు, 2005లో రామినేని ఫౌండేషన్ విశేష పురస్కారం, కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖ ఉత్తమ సంఘసేవకురాలు పురస్కారం, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ అవార్డు, ఇందిరా ప్రియదర్శిని ప్రతిభా అవార్డు తదితర పురస్కారాలు, సన్మానాలు పొందారు. ఆమె తన 99వ యేట 2017, జూలై 5వ తేదీ బుధవారం హైదరాబాదులో మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# పీఎఫ్ సభ్యులకు కొత్త నిబంధనలు

**న్యూఢిల్లీ, జూలై 4 :** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ తన సేవలను మరింత ఆధునికంగా, వేగవంతంగా మార్చే దిశగా కీలక నిర్ణయాలు తీసుకుంది. సరికొత్త సభ్యుల పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ఇప్పటి వరకు వెబ్‌సైట్‌లో లభించిన కొన్ని ముఖ్యమైన సేవలను ప్రభుత్వ ఉమంగ్ మొబైల్ యాప్‌కు బదిలీ చేసింది. ఈ మార్పుల ద్వారా సభ్యులకు మరింత సురక్షితమైన, సులభమైన సేవలు అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇకపై యూనివర్సల్ అకౌంట్ నంబర్ యాక్టివేషన్, కొత్త యూఏఎన్ సృష్టి వంటి సేవలు ఈపీఎఫ్ఓ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉండవు. ఈ సేవలను పొందాలంటే తప్పనిసరిగా ఉమంగ్ యాప్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది. అలాగే ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు ధ్రువీకరణను తప్పనిసరి చేసింది. దీంతో సభ్యుల గుర్తింపును మరింత కచ్చితంగా నిర్ధారించి మోసాలను అరికట్టాలని ఈపీఎఫ్ఓ భావిస్తోంది. యూఏఎన్‌ను యాక్టివేట్ చేసుకోవాలనుకునే సభ్యులు ముందుగా తమ స్మార్ట్‌ఫోన్‌లో ఉమంగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అనంతరం ఈపీఎఫ్ఓ సేవల విభాగంలోకి వెళ్లి ముఖ గుర్తింపు ఆధారిత యూఏఎన్ సేవల ఎంపికను ఎంచుకుని యాక్టివేషన్ ప్రక్రియను పూర్తి చేయాలి. ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు విజయవంతంగా పూర్తయిన వెంటనే యూఏఎన్ యాక్టివేట్ అవుతుంది. ఇప్పటికే పీఎఫ్ ఖాతా ఉన్నప్పటికీ యూఏఎన్ కేటాయించని సభ్యులకు కూడా ఈపీఎఫ్ఓ ఊరటనిచ్చింది. అలాంటి వారు ఉమంగ్ యాప్ ద్వారా కొత్త యూఏఎన్‌ను పొందే అవకాశం కల్పించింది. నమోదు చేసిన మొబైల్ నంబర్‌ను ధ్రువీకరించి, అవసరమైన వివరాలు సమర్పించి, ముఖ గుర్తింపు ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత కొత్త యూఏఎన్‌ను సృష్టిస్తారు. ఆ తర్వాత దానిని పాత పీఎఫ్ ఖాతాతో అనుసంధానం చేయడంతో ఖాతాలోని మొత్తం సురక్షితంగా కొనసాగుతుంది. యూఏఎన్‌ను మర్చిపోయిన సభ్యుల కోసం కూడా ఈపీఎఫ్ఓ సులభమైన విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. నమోదిత మొబైల్ నంబర్‌ను నమోదు చేసి, గుర్తింపు లేదా చిరునామా రుజువు పత్రాన్ని అప్‌లోడ్ చేసి, మొబైల్‌కు వచ్చే ధ్రువీకరణ సంఖ్యను నమోదు చేస్తే యూఏఎన్ వివరాలను తిరిగి తెలుసుకోవచ్చు. మరణించిన సభ్యుల పీఎఫ్ క్లెయిమ్‌ల విషయంలో మాత్రం ఎలాంటి మార్పు లేదు. ఆ సేవలు ఇప్పటిలాగే ఈపీఎఫ్ఓ పాత పోర్టల్‌లోనే కొనసాగుతాయి. క్లెయిమ్ దాఖలు చేసే సమయంలో ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్, బ్యాంకు ఖాతా రుజువు, మరణ ధ్రువీకరణ పత్రం, అవసరమైతే జనన తేదీ ధ్రువీకరణ పత్రం వంటి పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అన్ని పత్రాలను పీడీఎఫ్ రూపంలో, రెండు మెగాబైట్ల పరిమితిలో, ఫైల్ పేరులో ఖాళీలు లేకుండా అప్‌లోడ్ చేయాలని ఈపీఎఫ్ఓ సూచించింది. కొత్త మార్పుల వల్ల ప్రస్తుతం సభ్యుల వద్ద ఉన్న యూఏఎన్‌లు లేదా పీఎఫ్ ఖాతాల్లోని నిల్వలపై ఎలాంటి ప్రభావం ఉండదని సంస్థ స్పష్టం చేసింది. సేవలు అందించే విధానంలో మాత్రమే మార్పులు చేసినట్లు తెలిపింది. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలంటే సభ్యులందరూ తమ ఆధార్ వివరాలు, నమోదిత మొబైల్ నంబర్, కేవైసీ సమాచారాన్ని ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలని ఈపీఎఫ్ఓ సూచించింది.






# పసిడికి మళ్లీ రెక్కలు

**హైదరాబాద్, జులై 4 :** ఇటీవల వరుసగా తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు మరోసారి పెరుగుదల బాట పట్టాయి. గత రెండు రోజులుగా పసిడి ధరలు క్రమంగా పెరుగుతుండటంతో కొనుగోలుదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. శనివారం ఉదయం నమోదైన ధరల ప్రకారం హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,47,010కు చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,34,760గా నమోదైంది. ఇదే సమయంలో వెండి ధర కూడా స్వల్పంగా పెరిగింది. కిలో వెండిపై రూ.100 పెరగడంతో హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,60,100గా కొనసాగుతోంది. తెలంగాణలోని హైదరాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,47,010గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,34,760గా, 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,10,260గా నమోదైంది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతిలో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో మాత్రం స్వల్ప వ్యత్యాసం కనిపిస్తోంది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,49,570గా ఉండి దేశంలోనే అత్యధికంగా నమోదైంది. అక్కడ 22 క్యారెట్ల బంగారం రూ.1,37,010, 18 క్యారెట్ల బంగారం రూ.1,14,410గా ఉంది. న్యూఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,47,160, 22 క్యారెట్ల బంగారం రూ.1,34,910, 18 క్యారెట్ల బంగారం రూ.1,10,410గా నమోదైంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో హైదరాబాద్‌తో సమానంగానే ధరలు కొనసాగుతున్నాయి. అహ్మదాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,47,060, 22 క్యారెట్ల బంగారం రూ.1,34,810, 18 క్యారెట్ల బంగారం రూ.1,10,310గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, విదేశీ మారకపు విలువల్లో మార్పులు, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, పెట్టుబడిదారుల కొనుగోళ్ల ప్రభావంతో బంగారం, వెండి ధరల్లో ప్రతిరోజూ హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. పండుగలు, శుభకార్యాల సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. అందువల్ల బంగారం కొనుగోలు చేయాలనుకునే వారు కొనుగోలు చేసే ముందు స్థానిక ఆభరణాల దుకాణాల్లో తాజా ధరలను ఒకసారి పరిశీలించడం మంచిదని సూచిస్తున్నారు.




# ఈ20 పెట్రోల్‌కు భూటాన్ నిరాకరణ




**న్యూఢిల్లీ, జూలై 4 :** ఇంధనంలో ఇథనాల్ వినియోగాన్ని పెంచే దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తున్న వేళ, పొరుగు దేశం భూటాన్ మాత్రం ఈ20 పెట్రోల్‌ను స్వీకరించేందుకు నిరాకరించింది. తమ దేశానికి ఇప్పటిలాగే సాధారణ పెట్రోల్‌ను మాత్రమే సరఫరా చేయాలని భారత చమురు మార్కెటింగ్ సంస్థలను భూటాన్ ప్రభుత్వం కోరింది. ఈ నిర్ణయానికి సంబంధించిన కారణాలు ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి. భూటాన్‌లో ప్రస్తుతం వినియోగంలో ఉన్న భూగర్భ ఇంధన నిల్వ ట్యాంకులు చాలా వరకు పాతవేనని, అవి ఈ20 పెట్రోల్‌కు అనుకూలంగా లేవని అధికారులు వెల్లడించారు. ఇథనాల్‌కు తేమను త్వరగా పీల్చుకునే స్వభావం ఉండటంతో ట్యాంకుల్లోకి నీరు చేరితే ఇంధనం కలుషితమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. దీనివల్ల వాహనాల ఇంజిన్‌పై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని భూటాన్ ఆందోళన వ్యక్తం చేసింది. భూటాన్‌లో ఎక్కువ ప్రాంతాలు కొండలు, లోయలు, ఎత్తైన రహదారులతో కూడి ఉండటంతో వాహనాలకు పూర్తి శక్తి అవసరమవుతుందని అధికారులు తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో ఈ20 పెట్రోల్ సాధారణ పెట్రోల్ స్థాయిలో పనితీరు అందిస్తుందా లేదా అనే సందేహాలు ఉన్నాయని అక్కడి మీడియా వెల్లడించింది. ఈ కారణంగానే ప్రస్తుతం ఈ20 ఇంధనాన్ని వినియోగించేందుకు భూటాన్ వెనుకడుగు వేసినట్లు సమాచారం. భవిష్యత్తులో భారత్ ఈ25 లేదా పూర్తిగా ఇథనాల్ ఆధారిత ఇంధన విధానానికి మారే నిర్ణయం తీసుకుంటే ముందుగానే తమకు సమాచారం ఇవ్వాలని కూడా భూటాన్ భారత ప్రభుత్వాన్ని కోరింది. దీంతో తమ ఇంధన నిల్వ వ్యవస్థలు, వాహనాల నిర్వహణలో అవసరమైన మార్పులు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపింది. భూటాన్‌కు అవసరమైన మొత్తం పెట్రోల్, డీజిల్‌ను భారత్ నుంచే దిగుమతి చేసుకుంటోంది. దేశీయంగా భారత పెట్రోల్ బంకుల్లో విక్రయించే ఇంధనానికి భిన్నంగా, ఎగుమతుల కోసం ప్రత్యేకంగా ఉత్పత్తి చేసే నాణ్యమైన ఇంధనాన్ని భూటాన్‌కు సరఫరా చేస్తున్నారు. ఇదిలా ఉండగా, భారత్‌లో ఈ20 పెట్రోల్‌పై ఇప్పటికే చర్చ కొనసాగుతోంది. 2023కు ముందు తయారైన కొన్ని పెట్రోల్ వాహనాల యజమానులు మైలేజీ తగ్గడం, నిర్వహణ వ్యయం పెరగడం వంటి అంశాలను ప్రస్తావిస్తున్నారు. అయితే ఇంధనంలో ఇథనాల్ వినియోగం పెరగడం వల్ల ముడి చమురు దిగుమతులపై ఆధారపడటం తగ్గడంతో పాటు కాలుష్యం కూడా తగ్గుతుందని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. మైలేజీలో స్వల్ప తగ్గుదల కనిపించినప్పటికీ ఇంజిన్ పనితీరు, వేగవంతమైన స్పందనలో మెరుగుదల ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

# ఎయిర్ ఫ్రైయర్లపై భారీ తగ్గింపులు

**న్యూఢిల్లీ, జులై 4:** ప్రముఖ ఈ–వాణిజ్య సంస్థ అమెజాన్ ఇండియా నిర్వహిస్తున్న ప్రైమ్ డే సేల్‌లో ఎయిర్ ఫ్రైయర్లపై భారీ రాయితీలు అందుబాటులోకి వచ్చాయి. ఎలక్ట్రానిక్ వస్తువులు, గృహోపకరణాలతో పాటు వంటగది పరికరాలపై కూడా ఆకర్షణీయమైన ధరలు ప్రకటించింది. ముఖ్యంగా ఆరోగ్యకరమైన వంట కోసం విస్తృతంగా ఉపయోగిస్తున్న ఎయిర్ ఫ్రైయర్లపై గరిష్ఠంగా 75 శాతం వరకు తగ్గింపు ఇవ్వడంతో వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. ప్రముఖ ఫిలిప్స్ బ్రాండ్‌కు చెందిన ఆరు దశాంశ రెండు లీటర్ల సామర్థ్యం గల ఎక్స్‌ట్రా లార్జ్ మోడల్‌పై అసలు ధరతో పోలిస్తే 25 నుంచి 30 శాతం వరకు తగ్గింపు లభిస్తోంది. రాపిడ్ ఎయిర్ టెక్నాలజీతో పనిచేసే ఈ మోడల్ పెద్ద కుటుంబాల అవసరాలకు అనుకూలంగా ఉంటుంది. అలాగే ఏడు దశాంశ రెండు లీటర్ల సామర్థ్యం, టచ్‌స్క్రీన్ సౌకర్యం, లోపలి వంట ప్రక్రియను చూసేందుకు ప్రత్యేక అద్దం కలిగిన ప్రీమియం మోడళ్లపై బ్యాంకు ఆఫర్లు కూడా అందుబాటులో ఉన్నాయి. నింజా బ్రాండ్‌కు చెందిన ప్రీమియం ఎయిర్ ఫ్రైయర్లపై కూడా ప్రత్యేక రాయితీలు ఉన్నాయి. రెండు వేర్వేరు బుట్టలతో ఒకేసారి రెండు రకాల వంటకాలను వేర్వేరు ఉష్ణోగ్రతల్లో సిద్ధం చేసుకునే సౌకర్యం ఉన్న డ్యూయల్‌జోన్ మోడల్‌పై 20 శాతానికి పైగా తగ్గింపు లభిస్తోంది. తక్కువ స్థలంలో అమర్చుకునే విధంగా రూపొందించిన డబుల్ స్టాక్ నమూనాలు కూడా ప్రత్యేక ధరలకు విక్రయిస్తున్నారు. తక్కువ బడ్జెట్‌లో కొనుగోలు చేయాలనుకునే వినియోగదారుల కోసం కూడా పలు ఆఫర్లు అందుబాటులో ఉన్నాయి. మూడు వేల నుంచి ఐదు వేల రూపాయల ధరల పరిధిలో లభించే లైఫ్‌లాంగ్, కెంట్ బ్రాండ్ల నాలుగు లీటర్ల సామర్థ్యం గల ఎయిర్ ఫ్రైయర్లు భారీ తగ్గింపుతో విక్రయిస్తున్నారు. హావెల్స్, ప్రెస్టీజ్ బ్రాండ్లకు చెందిన తక్కువ నూనెతో వంట చేసే, వంట పూర్తయిన తర్వాత స్వయంచాలకంగా విద్యుత్ సరఫరా నిలిపివేసే సదుపాయం ఉన్న మోడళ్లపై కూడా ప్రత్యేక రాయితీలు ప్రకటించారు. ధరల తగ్గింపులతో పాటు వినియోగదారులకు అదనపు ప్రయోజనాలు కూడా కల్పిస్తున్నారు. ఎంపిక చేసిన బ్యాంకుల డెబిట్ లేదా క్రెడిట్ కార్డులతో కొనుగోలు చేస్తే అదనంగా పది శాతం వరకు తక్షణ తగ్గింపు లభిస్తుంది. అలాగే వడ్డీ లేని సులభ వాయిదాల సౌకర్యాన్ని కూడా అందుబాటులో ఉంచారు. పాత వంటగది పరికరాలను ఇచ్చి కొత్త ఎయిర్ ఫ్రైయర్ కొనుగోలు చేసే వారికి ఎంపిక చేసిన నమూనాలపై మార్పిడి రాయితీ కూడా వర్తిస్తుందని సంస్థ వెల్లడించింది.

# రిలయన్స్‌కు చేరువలో ఐటీ దిగ్గజాల విలువ

**ముంబై, జులై 4 :** భారత కార్పొరేట్ రంగంలో మార్కెట్ విలువల సమీకరణలు వేగంగా మారుతున్నాయి. ముఖేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ దేశంలోని ఐదు అగ్రశ్రేణి సమాచార సాంకేతిక సంస్థల ఉమ్మడి మార్కెట్ విలువకు దాదాపు సమాన స్థాయికి చేరుకుంది. సమాచార సాంకేతిక రంగం ప్రపంచవ్యాప్తంగా ఒత్తిడిని ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ సుమారు రూ.18 లక్షల కోట్లకు చేరుకుంది. అదే సమయంలో దేశంలోని ప్రముఖ సమాచార సాంకేతిక సంస్థలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో, టెక్ మహీంద్రా సంస్థల ఉమ్మడి మార్కెట్ విలువ రూ.18.12 లక్షల కోట్లుగా నమోదైంది. కొన్నేళ్ల క్రితం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఒక్కటే రిలయన్స్ కంటే అధిక మార్కెట్ విలువను కలిగి ఉండగా, ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఈ ఏడాది సమాచార సాంకేతిక రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. కృత్రిమ మేధస్సు ప్రభావంతో సంప్రదాయ సాంకేతిక సేవలపై డిమాండ్ తగ్గుతుందనే ఆందోళనలు, అంతర్జాతీయంగా సాంకేతిక రంగ వ్యయాల్లో కోతలు, ప్రపంచ ఆర్థిక అనిశ్చితి వంటి కారణాలతో ఈ రంగానికి చెందిన ప్రముఖ కంపెనీల షేర్లు భారీగా పతనమయ్యాయి. కొన్ని సంస్థల షేర్లు ఈ ఏడాదిలో ఇప్పటివరకు 36 శాతం వరకు విలువ కోల్పోయాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా అంతర్జాతీయ పరిణామాల ప్రభావానికి అతీతంగా నిలవలేకపోయింది. అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌లో నెలకొన్న ఒడిదొడుకులు, ముఖ్యంగా ఇరాన్––అమెరికా ఉద్రిక్తతల ప్రభావంతో ఈ ఏడాది రిలయన్స్ షేరు విలువ సుమారు 17 శాతం మేర తగ్గింది. గత నెలలో షేరు ధర 52 వారాల కనిష్ఠ స్థాయి రూ.1,253.20కు చేరుకోగా, ప్రస్తుతం రూ.1,304 వద్ద ట్రేడవుతోంది. ఇదే సమయంలో రిలయన్స్ తన వ్యాపార విస్తరణపై దృష్టి సారిస్తోంది. అప్పుల భారం తగ్గించే లక్ష్యంతో జియో ప్లాట్‌ఫార్మ్స్‌ను స్టాక్ మార్కెట్‌లో ప్రవేశపెట్టేందుకు సంస్థ సన్నాహాలు చేస్తోంది. ఇందుకోసం రూ.35 వేల కోట్ల నుంచి రూ.40 వేల కోట్ల వరకు నిధులు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంస్థ గత వార్షిక సర్వసభ్య సమావేశంలో వెల్లడించింది. ఈ చర్యలు భవిష్యత్తులో రిలయన్స్ ఆర్థిక బలాన్ని మరింత పెంచే అవకాశముందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.




# కొత్త క్విడ్ ఫేస్‌లిఫ్ట్ విడుదల

**న్యూఢిల్లీ, జులై 4 :** ప్రముఖ కార్ల తయారీ సంస్థ రెనో భారత మార్కెట్లో 2026 క్విడ్ ఫేస్‌లిఫ్ట్ మోడల్‌ను అధికారికంగా విడుదల చేసింది. కొత్త డిజైన్, అప్‌డేటెడ్ ఫీచర్లతో తీసుకొచ్చిన ఈ కారు ప్రారంభ ఎక్స్-షోరూమ్ ధరను రూ.4.52 లక్షలుగా నిర్ణయించింది. ఈసారి కంపెనీ వేరియంట్ల సంఖ్యను తగ్గించి కేవలం ఎవల్యూషన్, క్లైంబర్ అనే రెండు మోడళ్లలో మాత్రమే అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎవల్యూషన్ మాన్యువల్ వేరియంట్ ధర రూ.4.52 లక్షలు కాగా, ఆటోమేటిక్ వేరియంట్ ధర రూ.4.89 లక్షలుగా ఉంది. క్లైంబర్ మాన్యువల్ వేరియంట్ ధర రూ.5.14 లక్షలు, ఆటోమేటిక్ వేరియంట్ ధర రూ.5.60 లక్షలుగా నిర్ణయించారు. క్లైంబర్ వేరియంట్‌ను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే వినియోగదారులకు రూ.15 వేల నగదు రాయితీ కూడా ప్రకటించింది. దీంతో ఈ వేరియంట్ ప్రభావవంతమైన ధర రూ.4.99 లక్షలకు చేరుతుంది. ఫీచర్ల పరంగా ఎనిమిది అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ వ్యవస్థ, వైర్‌లెస్ ఆపిల్ కార్‌ప్లే, ఆండ్రాయిడ్ ఆటో, పూర్తి డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, వెనుక వీక్షణ కెమెరా వంటి ఆధునిక సౌకర్యాలను అందించింది. భద్రత కోసం డ్యూయల్ ఫ్రంట్ ఎయిర్‌బ్యాగ్‌లు, యాంటీ లాక్ బ్రేకింగ్ వ్యవస్థ, ఎలక్ట్రానిక్ బ్రేక్ ఫోర్స్ పంపిణీతో పాటు మొత్తం 17 భద్రతా ఫీచర్లను కల్పించింది. ఈ సెగ్మెంట్‌లో అత్యధికంగా 184 మిల్లీమీటర్ల గ్రౌండ్ క్లియరెన్స్, 279 లీటర్ల బూట్ స్పేస్ ఈ కారుకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. 2015లో మార్కెట్లోకి వచ్చిన క్విడ్ మోడల్ ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 4.5 లక్షలకు పైగా యూనిట్ల విక్రయాలు నమోదు చేసి, రెనోకు విజయవంతమైన మోడల్‌గా నిలిచింది.



# డకెట్‌కు కొత్త జోడీ!





**లండన్, జులై 4 :** వన్డే ప్రపంచకప్--2027 సన్నాహకాల్లో భాగంగా ఇంగ్లండ్ జట్టు ఓపెనింగ్ జోడీని ఖరారు చేసే పనిలో నిమగ్నమైంది. బెన్ డకెట్‌కు స్థిరమైన భాగస్వామి కోసం అన్వేషిస్తున్న ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు యువ బ్యాటర్ జాకబ్ బెథెల్‌పై ఆశలు పెట్టుకుంది. మూడు ఫార్మాట్లలోనూ దూకుడైన ఆటతో ఆకట్టుకుంటున్న ఈ యువ క్రికెటర్‌ను భవిష్యత్ ఓపెనర్‌గా తీర్చిదిద్దాలని యోచిస్తోంది. ప్రస్తుతం నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేస్తున్న బెథెల్‌ను భారత్‌తో జరిగే వన్డే సిరీస్‌లోనే డకెట్‌కు జోడీగా పంపే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏడేళ్ల క్రితం ఇయాన్ మోర్గాన్ నాయకత్వంలో వన్డే ప్రపంచకప్ గెలిచిన ఇంగ్లండ్ మరోసారి ప్రపంచకప్‌పై కన్నేసింది. మెగా టోర్నీకి మరో ఆరు నెలల సమయం మాత్రమే ఉండటంతో జట్టు కూర్పుపై బోర్డు ప్రత్యేక దృష్టి సారించింది. అయితే బెన్ డకెట్‌కు సరైన ఓపెనింగ్ భాగస్వామి ఇంకా దొరకకపోవడం ఆ జట్టుకు తలనొప్పిగా మారింది. గత కొంతకాలంగా ఫిల్ సాల్ట్, జేమీ స్మిత్, జాక్ క్రాలే, రెహాన్ అహ్మద్‌లకు అవకాశాలు ఇచ్చినా వారు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. దీంతో ఇప్పుడు జాకబ్ బెథెల్‌కు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇప్పటివరకు 21 వన్డేలు ఆడిన బెథెల్ 19 ఇన్నింగ్స్‌ల్లో 33.50 సగటుతో 603 పరుగులు సాధించాడు. ఇందులో ఐదు అర్ధశతకాలు ఉన్నాయి. అతని అత్యధిక వ్యక్తిగత స్కోరు 110 పరుగులు. దూకుడైన బ్యాటింగ్‌తో పాటు పరిస్థితులకు అనుగుణంగా ఆడగల సామర్థ్యం అతడిని ఓపెనర్‌గా పరిశీలించడానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. వన్డేలతో పాటు టెస్టుల్లోనూ బెథెల్‌ను ఓపెనర్‌గా ప్రమోట్ చేసే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియాపై అతడు అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ముఖ్యంగా సిడ్నీ టెస్టులో 229 బంతుల్లో 142 పరుగులు చేసి తన సత్తా చాటాడు. ఈ ప్రదర్శనతో సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ బెన్ డకెట్‌కు జోడీగా బెథెల్‌ను బరిలోకి దించే దిశగా ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు ఆలోచిస్తున్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.



# ప్రజ్ఞానంద జోరు.. అగ్రస్థానంలోకి

**జాగ్రెబ్, జులై 4 :** క్రొయేషియాలో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక గ్రాండ్ చెస్ టూర్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ర్యాపిడ్ విభాగం చివరి రోజు జరిగిన మూడు మ్యాచ్‌ల్లోనూ వరుస విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఫ్రాన్స్‌కు చెందిన అలీరెజా ఫిరౌజాతో కలిసి సంయుక్తంగా తొలి స్థానంలో కొనసాగుతున్నాడు. మరోవైపు ప్రపంచ చెస్ ఛాంపియన్ డి. గుకేశ్ మాత్రం చివరి రోజు వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూసి ఐదో స్థానానికి పరిమితమయ్యాడు. ర్యాపిడ్ విభాగంలో చివరి రోజు ప్రజ్ఞానంద పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. ఆతిథ్య దేశం క్రొయేషియాకు చెందిన ఇవాన్ సరిక్, రొమేనియాకు చెందిన డీక్ బొగ్డన్, నెదర్లాండ్స్ గ్రాండ్‌మాస్టర్ అనిశ్ గిరిలపై వరుస విజయాలు నమోదు చేశాడు. ఈ మూడు విజయాలతో మొత్తం 12 పాయింట్లు సాధించి అగ్రస్థానాన్ని అందుకున్నాడు. ప్రజ్ఞానందతో సమానంగా ఫ్రాన్స్ గ్రాండ్‌మాస్టర్ అలీరెజా ఫిరౌజా కూడా 12 పాయింట్లతో సంయుక్త అగ్రస్థానంలో నిలిచాడు. మరోవైపు భారీ అంచనాల మధ్య బరిలోకి దిగిన డి. గుకేశ్‌కు చివరి రోజు ఏమాత్రం కలిసిరాలేదు. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోవడంతో అతడు జర్మనీకి చెందిన విన్సెంట్ కేమెర్‌తో కలిసి 10 పాయింట్లతో సంయుక్తంగా ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇప్పుడు టోర్నీలోని బ్లిట్జ్ విభాగం మిగిలి ఉంది. మొత్తం 18 రౌండ్ల పాటు సాగే ఈ పోటీల్లోనే గ్రాండ్ చెస్ టూర్ విజేత ఎవరో తేలనుంది. దీంతో ప్రతి మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# మెక్సికో మ్యాచ్‌కు ఇంగ్లండ్ ప్రత్యేక వ్యూహం




**మెక్సికో సిటీ, జులై 4 :** ఫిఫా ప్రపంచకప్ నాకౌట్ దశలో మెక్సికోతో తలపడనున్న ఇంగ్లండ్ జట్టు ఆసక్తికర నిర్ణయం తీసుకుంది. అధిక ఎత్తులో ఉన్న స్టేడియంలో ఆటగాళ్లు శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు వైద్యుల పర్యవేక్షణలో వయాగ్రా మాత్రల వినియోగానికి అనుమతి ఇచ్చినట్లు సమాచారం. ఈ నిర్ణయం ఫుట్‌బాల్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మెక్సికో సిటీలోని ఎస్టాడియో అజ్‌టెకా స్టేడియంలో ఈ నాకౌట్ మ్యాచ్ జరగనుంది. సముద్ర మట్టానికి సుమారు 2,240 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ మైదానంలో ఆక్సిజన్ సాంద్రత తక్కువగా ఉండటంతో ఆటగాళ్లు త్వరగా అలసిపోయే అవకాశం ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇంగ్లండ్ జట్టు ప్రత్యేక సన్నాహాలు చేసింది. ఇప్పటికే ఆటగాళ్లు తగినంత విశ్రాంతి తీసుకునేలా ఏర్పాట్లు చేసిన జట్టు యాజమాన్యం, మ్యాచ్ సమయంలో శారీరక సామర్థ్యాన్ని నిలబెట్టేందుకు వైద్యపరమైన సూచనల మేరకు వయాగ్రా వినియోగానికి కూడా అనుమతించినట్లు తెలుస్తోంది. అధిక ఎత్తులో రక్తనాళాలు విస్తరించి రక్తప్రసరణ మెరుగుపడేందుకు వయాగ్రా కొంతమేర ఉపయోగపడుతుందని గతంలో కొన్ని వైద్య పరిశోధనలు సూచించాయి. ఇదే కారణంతో ఇంగ్లండ్ జట్టు ఈ మార్గాన్ని పరిశీలించినట్లు సమాచారం. సాధారణంగా ఈ ఔషధాన్ని వేరే వైద్య అవసరాల కోసం వినియోగించినప్పటికీ, అధిక ఎత్తులో శారీరక సామర్థ్యాన్ని మెరుగుపర్చే అవకాశాలపై కూడా కొన్ని అధ్యయనాలు జరిగాయి. ఆతిథ్య మెక్సికో ఆటగాళ్లకు అక్కడి వాతావరణం, ఎత్తైన మైదాన పరిస్థితులు అలవాటై ఉండటంతో వారికి పెద్దగా ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. అయితే ఇంగ్లండ్ ఆటగాళ్లు అలసటకు గురికాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. వరుస విజయాలతో ఆత్మవిశ్వాసంగా ఉన్న మెక్సికోను నిలువరించేందుకు ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక వ్యూహాలతో బరిలోకి దిగుతున్నట్లు జట్టు వర్గాలు వెల్లడించాయి.



# అబ్రార్‌కు దేశమా.. లీగ్‌నా?

**లాహోర్, జులై 4 :**
పాకిస్థాన్ మిస్టరీ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ ప్రస్తుతం కెరీర్‌లో అత్యంత కీలకమైన సందిగ్ధ పరిస్థితిని ఎదుర్కొంటున్నాడు. ఒకవైపు దేశం తరఫున వెస్టిండీస్‌తో జరిగే టెస్టు సిరీస్‌లో ఆడే అవకాశం ఉండగా, మరోవైపు భారీ పారితోషికంతో ఒప్పందం కుదుర్చుకున్న ఇంగ్లండ్‌లోని ప్రముఖ ఫ్రాంచైజీ లీగ్‌లో పాల్గొనే అవకాశం ఉంది. రెండు టోర్నీల షెడ్యూళ్లు ఒకేసారి రావడంతో అబ్రార్ ఏ నిర్ణయం తీసుకుంటాడనే అంశం ఆసక్తికరంగా మారింది. పాకిస్థాన్ జట్టు ఈ నెలలో వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌కు అబ్రార్ అహ్మద్‌ను ఎంపిక చేయాలని సెలక్షన్ కమిటీ యోచిస్తోంది. అదే సమయంలో ఇంగ్లండ్‌లో జరిగే 'ది హండ్రెడ్' లీగ్‌కు కూడా అతడు ఎంపికయ్యాడు. ఈ లీగ్‌లో సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు అబ్రార్‌ను సుమారు రూ.2.3 కోట్లకు సొంతం చేసుకుంది. ఈ జట్టుకు సన్‌రైజర్స్ హైదరాబాద్ సహ యజమాని కావ్య మారన్ యాజమాన్యం వహిస్తున్నారు. 'ది హండ్రెడ్' టోర్నీ జులై 21న ప్రారంభం కానుండగా, వెస్టిండీస్‌తో పాకిస్థాన్ తొలి టెస్టు జులై 25 నుంచి ప్రారంభమవుతుంది. దీంతో రెండు టోర్నీల్లో ఒకేసారి పాల్గొనడం సాధ్యం కాకపోవడంతో అబ్రార్ ఏదో ఒకదానిని మాత్రమే ఎంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. టెస్టు జట్టులో చోటు దక్కితే లీగ్‌కు దూరం కావాల్సి ఉంటుంది. అబ్రార్‌ను 'ది హండ్రెడ్' వేలంలో కొనుగోలు చేయడం గతంలోనే పెద్ద చర్చకు దారితీసింది. భారత్-పాకిస్థాన్ మధ్య క్రికెట్ సంబంధాలు నిలిచిపోయిన నేపథ్యంలో భారత యాజమాన్యంలోని ఫ్రాంచైజీ పాకిస్థాన్ ఆటగాడిని భారీ మొత్తానికి తీసుకోవడంపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తాయి. అయితే అన్ని దేశాల ఆటగాళ్లకు సమాన అవకాశాలు కల్పించాలనే నిబంధనల ప్రకారం ఎంపిక జరిగినట్లు నిర్వాహకులు స్పష్టం చేశారు. ఇక పాకిస్థాన్ జట్టు దృష్టిలో వెస్టిండీస్ పిచ్‌లపై అబ్రార్ లాంటి లెగ్ స్పిన్నర్ కీలక పాత్ర పోషిస్తాడనే అభిప్రాయం ఉంది. అందుకే అతడిని టెస్టు జట్టులోకి తీసుకునే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. సోమవారం టెస్టు జట్టును ప్రకటించనున్న నేపథ్యంలో అబ్రార్‌కు స్థానం దక్కుతుందా లేదా అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ టెస్టు జట్టులో ఎంపికైతే 'ది హండ్రెడ్' లీగ్‌లో ఆడేందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నిరభ్యంతర పత్రం జారీ చేస్తుందా లేదా అనేది కూడా కీలకంగా మారింది. దీంతో అబ్రార్ భవిష్యత్తు ఇప్పుడు సెలక్టర్లు, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తీసుకునే నిర్ణయంపైనే ఆధారపడి ఉంది.

# కేప్ వెర్డే పోరాటం..

## అర్జెంటీనాకు చెమటలు



**మెక్సికో సిటీ, జులై 4 :**
ఫిఫా ప్రపంచకప్-2026 నాకౌట్ దశలో అర్జెంటీనా, కేప్ వెర్డే మధ్య జరిగిన పోరు అభిమానులను ఉర్రూతలూగించింది. ప్రపంచ ఛాంపియన్ అర్జెంటీనాను చిన్న ద్వీప దేశమైన కేప్ వెర్డే చివరి వరకు గట్టిగా నిలువరించినా అదనపు సమయంలో 3--2 తేడాతో ఓటమి పాలైంది. ఓడిపోయినప్పటికీ కేప్ వెర్డే ప్రదర్శన ఫుట్‌బాల్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. మ్యాచ్ ఆరంభం నుంచే ఇరు జట్లు దూకుడుగా ఆడాయి. అర్జెంటీనా ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నించగా, కేప్ వెర్డే కట్టుదిట్టమైన రక్షణతో పాటు వేగవంతమైన ఎదురుదాడులతో ఆకట్టుకుంది. నిర్ణీత 90 నిమిషాల ఆట ముగిసే సమయానికి ఇరు జట్లు చెరో గోల్ నమోదు చేయడంతో స్కోరు 1--1తో సమమైంది. దీంతో మ్యాచ్ అదనపు సమయానికి వెళ్లింది. అదనపు సమయం ప్రారంభంలోనే అర్జెంటీనా మరో గోల్ చేసి 2--1తో ఆధిక్యంలోకి వెళ్లింది. మ్యాచ్ తమ చేతిలోనే ఉందని భావించిన సమయంలో కేప్ వెర్డే మిడ్‌ఫీల్డర్ సిడ్నీ లోప్స్ కాబ్రల్ అద్భుత గోల్‌తో అందరినీ ఆశ్చర్యపరిచాడు. పెనాల్టీ ప్రాంతం అంచు నుంచి అతడు కొట్టిన శక్తివంతమైన షాట్ నేరుగా గోల్‌పోస్ట్ పై మూలలోకి దూసుకెళ్లడంతో స్కోరు 2--2తో సమమైంది. ఈ గోల్ టోర్నీలోనే అత్యుత్తమ గోల్స్‌లో ఒకటిగా నిలిచే అవకాశముందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే మ్యాచ్ ముగియడానికి కొద్దిసేపటి ముందు అర్జెంటీనా మరోసారి తన అనుభవాన్ని చాటుకుంది. కేప్ వెర్డే రక్షణను ఛేదించి మూడో గోల్ నమోదు చేయడంతో 3--2తో ఆధిక్యం సాధించింది. మిగిలిన సమయంలో కేప్ వెర్డే సమం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో అర్జెంటీనా క్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధించగా, ఓటమిపాలైన కేప్ వెర్డే తన అసాధారణ పోరాట పటిమతో ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానుల ప్రశంసలు అందుకుంది.



# నేడు భారత్-ఇంగ్లండ్ రెండో టీ20

**మాంచెస్టర్, జులై 4:**
భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ శనివారం మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో జరగనుంది. భారత కాలమానం ప్రకారం రాత్రి 7 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఐర్లాండ్ పర్యటనలో సిరీస్‌ను కోల్పోయిన భారత్, ఇంగ్లండ్‌తో తొలి టీ20 వర్షం కారణంగా రద్దు కావడంతో ఈ మ్యాచ్‌కు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. సిరీస్‌లో ఆధిక్యం సాధించాలనే లక్ష్యంతో ఇరు జట్లు బరిలోకి దిగుతున్నాయి. మరోవైపు దేశవాళీ క్రికెట్‌లో సంచలన ప్రదర్శనలతో గుర్తింపు తెచ్చుకున్న యువ ఆల్‌రౌండర్ వైభవ్ ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానం సాధారణంగా బ్యాటర్లు, బౌలర్లకు సమానంగా సహకరించే పిచ్‌గా గుర్తింపు పొందింది. అయితే పరిస్థితులు అనుకూలిస్తే భారీ స్కోర్లు నమోదవుతుంటాయి. గతేడాది ఇదే వేదికపై దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20లో ఇంగ్లండ్ 304 పరుగులు చేసి రికార్డు సృష్టించింది. దీంతో ఈ మ్యాచ్‌లోనూ భారీ స్కోరు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. టాస్ గెలిచే జట్టు పిచ్ పరిస్థితులను బట్టి కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అయితే ఈ మ్యాచ్‌కు కూడా వర్షం ముప్పు వెంటాడుతోంది. తొలి మ్యాచ్ ఒక్క బంతి కూడా పడకుండా రద్దయిన నేపథ్యంలో రెండో మ్యాచ్‌కు కూడా వర్షం ఆటంకం కలిగించే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీంతో అభిమానుల్లో మరోసారి ఉత్కంఠ నెలకొంది. వర్షం దూరంగా ఉండి మ్యాచ్ పూర్తిస్థాయిలో సాగితే ఆసక్తికర పోరు ఖాయమని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి.

# విజయం వచ్చినా మెస్సీ అసంతృప్తి

**మయామి, జులై 4 :**


ఫిఫా ప్రపంచకప్-2026 రౌండ్ ఆఫ్-32లో కేప్ వెర్డేపై 3-2 తేడాతో కష్టపడి విజయం సాధించి ప్రిక్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్న అర్జెంటీనా జట్టు ఆటతీరుపై కెప్టెన్ లియోనెల్ మెస్సీ అసంతృప్తి వ్యక్తం చేశాడు. గెలుపు దక్కినప్పటికీ జట్టులోని లోపాలు స్పష్టంగా కనిపించాయని, నాకౌట్ దశలో ఇలాంటి తప్పులు పునరావృతమైతే తీవ్ర మూల్యం చెల్లించాల్సి వస్తుందని సహచర ఆటగాళ్లను హెచ్చరించాడు. మయామిలో జరిగిన ఈ ఉత్కంఠభరిత పోరులో నిర్ణీత సమయంలో ఇరు జట్లు 2--2తో సమంగా నిలిచాయి. దీంతో మ్యాచ్ అదనపు సమయానికి వెళ్లింది. అదనపు సమయంలో మెస్సీ కొట్టిన కార్నర్‌ను అర్జెంటీనా ఆటగాడు రొమెరో హెడర్‌తో గోల్‌గా మలిచే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో బంతి కేప్ వెర్డే ఆటగాడి చేతికి తగిలి వారి సొంత గోల్‌పోస్ట్‌లోకి వెళ్లడంతో అర్జెంటీనాకు అదృష్టం కలిసి వచ్చింది. అదే నిర్ణయాత్మక గోల్‌గా మారడంతో 3-2తో విజయం సాధించిన అర్జెంటీనా ప్రిక్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధించింది. తదుపరి మ్యాచ్‌లో ఈజిప్ట్‌తో తలపడనుంది. మ్యాచ్ అనంతరం మెస్సీ మాట్లాడుతూ జట్టు ప్రదర్శనపై నిరాశ వ్యక్తం చేశాడు. ప్రారంభంలో ఆధిక్యం సాధించిన తర్వాత ఆటను పూర్తిగా తమ నియంత్రణలో ఉంచుకోవాల్సి ఉండగా అలా చేయలేకపోయామని చెప్పాడు. బంతిపై ఆధిపత్యాన్ని కోల్పోవడంతో పాటు ప్రత్యర్థిపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమయ్యామని పేర్కొన్నాడు. కేప్ వెర్డే ఆటగాళ్లు శారీరక బలంతో తమపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారని, అలాంటి పరిస్థితుల్లో జట్టు మరింత మెరుగ్గా ఆడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డాడు. కేప్ వెర్డేను తాము ఏమాత్రం తక్కువగా అంచనా వేయలేదని మెస్సీ స్పష్టం చేశాడు. గతంలో బలమైన జట్లను కూడా ఇబ్బంది పెట్టిన ఆ జట్టు నాకౌట్ దశకు చేరుకోవడం యాదృచ్ఛికం కాదని చెప్పాడు. నాకౌట్ మ్యాచ్‌ల్లో ఏ ప్రత్యర్థినైనా తేలికగా తీసుకుంటే ప్రమాదమేనని, ఇప్పుడు పూర్తిగా ఈజిప్ట్‌తో జరిగే తదుపరి మ్యాచ్‌పైనే దృష్టి సారిస్తామని వెల్లడించాడు. జట్టు ఆటపై అసంతృప్తి వ్యక్తం చేసిన మెస్సీ వ్యక్తిగతంగా మాత్రం అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో 29వ నిమిషంలో గోల్ నమోదు చేసిన అతడు ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో వరుసగా ఎనిమిది మ్యాచ్‌ల్లో గోల్ చేసిన తొలి ఆటగాడిగా ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఈ విజయంతో అర్జెంటీనా టోర్నీలో తన అజేయ ప్రస్థానాన్ని కొనసాగించింది..

# 10న విడుదలవుతున్న లెనిన్

## నేడు తిరుపతిలో ప్రీ రిలీజ్ ఈవెంట్




అక్కినేని అఖిల్ హీరోగా, అందాల తార భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించిన చిత్రం 'లెనిన్'. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూలై 10న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. అఖిల్ కెరీర్‌లో ఎంతో కీలకంగా భావిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలలో మరింత వేగవంతం చేసింది. ఇప్పటికే విడుదలైన 'లెనిన్' ట్రైలర్ కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా యాక్షన్, ఎమోషన్స్, నాగార్జున వాయిస్ ఓవర్‌తో రూపొందిన ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచింది. తాజాగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ తేదీ, వేదికను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. జూలై 5న తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్స్‌లో లెనిన్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను చిత్ర యూనిట్ ఘనంగా నిర్వహించనుంది. ఈ ఈవెంట్‌కు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే ప్రారంభమైనట్లు తెలుస్తోంది.




# శరవేగంగా ప్రభాస్ స్పిరిట్ షూటింగ్

### నగర శివారులో జెట్ స్పీడ్‌తో చిత్రీకరణ

రెబల్ స్టార్ ప్రభాస్, సెన్సేషనల్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్పిరిట్' షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్ అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జెట్ స్పీడ్‌లో సాగుతుండగా.. చిత్ర బృందం ఎలాంటి విరామం లేకుండా వరుస షెడ్యూళ్లతో దూసుకెళుతోంది. స్పిరిట్ షూటింగ్‌లో ఇప్పటికే దాదాపు 70 శాతం పూర్తయినట్లు, కేవలం 30 శాతం చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా కోసం ప్రభాస్ కూడా పూర్తిస్థాయిలో సమయం కేటాయిస్తూ.. ప్రతి యాక్షన్ సన్నివేశాన్ని డూప్ లేకుండా స్వయంగా చేస్తున్నారని సమాచారం. యాక్షన్ సీక్వెన్స్‌లలో ప్రభాస్ అంకితభావం చిత్ర యూనిట్‌ను కూడా ఆకట్టుకుంటోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక దర్శకుడు సందీప్ రెడ్డి వంగా పనితీరు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రీ-ప్రొడక్షన్ దశలోనే ప్రతి సన్నివేశాన్ని, షూటింగ్ షెడ్యూల్‌ను పక్కాగా సిద్ధం చేసుకునే ఆయన.. సెట్స్‌పైకి వెళ్లిన తర్వాత మాత్రం శరవేగంగా చిత్రీకరణ పూర్తి చేసే దర్శకుడిగా పేరొందాడు. 'స్పిరిట్' విషయంలోనూ అదే వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముందస్తు ప్రణాళిక కారణంగానే షూటింగ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా కొనసాగుతోందని సమాచారం.

# రాజమౌళికి అరుదైన గౌరవం

### వాల్ ఆఫ్ ఫిల్మ్ మేకర్స్'లో చోటు




తెలుగు సినిమా గ్లోబల్ స్థాయికి వెళ్ళిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళికి ఫ్రాన్స్ లో మరొక అరుదైన గౌరవం దక్కింది. ఫ్రాన్స్ లోని లూమియర్ ఇన్స్టిట్యూట్, దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళిని ప్రత్యేకంగా సత్కరించింది. అక్కడి 'వాల్ ఆఫ్ ఫిల్మ్ మేకర్స్' పై ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ దర్శకుల పేర్లు ఉన్నాయి. ఇప్పుడు రాజమౌళి పేరు కూడా ఆ జాబితాలో చేరింది. ఈ ప్రోగ్రామ్ లో రాజమౌళి తెరకెక్కించిన 'ఈగ', 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాలను ప్రదర్శించారు. 2012 లో విడుదలైన 'ఈగ', చిన్న కాన్సెప్ట్ ను కొత్తగా చూపించిన సినిమాగా గుర్తింపు పొందింది. ఇక 'ఆర్‌ఆర్‌ఆర్' ప్రపంచవ్యాప్తంగా విడుదలై పలు అంతర్జాతీయ అవార్డులు అందుకోవడంతో పాటు, భారతీయ సినిమాపై విదేశీ ప్రేక్షకుల దృష్టిని మరింత ఆకర్షించింది. ఇటీవలే పారిస్ లోని 'సినిమాథెక్ ఫ్రాంకైస్' థియేటర్ లో రాజమౌళి పేరుతో శాశ్వత సీటును కేటాయించగా, ఇప్పుడు లూమియర్ ఇన్స్టిట్యూట్ జక్కన్న చిత్రాలతో ప్రత్యేక రెట్రోస్పెక్టివ్ ను నిర్వహిస్తుంది. 'బాహుబలి', 'ఈగ', 'ఆర్‌ఆర్‌ఆర్' లాంటి చిత్రాలను ప్రదర్శిస్తూ, భారతీయ సినిమాలపై అంతర్జాతీయ ప్రేక్షకుల్లో ఆసక్తి ఎలా పెరుగుతోందో ఈ కార్యక్రమం మరోసారి చూపిస్తుంది.

# ప్యారడైజ్ మూవీపై నాని ఫోకస్

### కొత్త చిత్రాలకు డేట్లు కుదరక నో




నేచురల్ స్టార్ నాని హీరోగా, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ది ప్యారడైజ్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రం కావడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఎస్-ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో నాని 'జడల్' అనే పూర్తి స్థాయి మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఆయనకు జోడీగా కయాదు లోహర్ 'సుబ్బలక్ష్మి' పాత్రలో నటిస్తోంది. విలక్షణ నటుడు మోహన్ బాబు ప్రధాన ప్రతినాయకుడిగా కనిపించనుండగా, సోనాలి కులకర్ణి, రాఘవ్ జుయల్, సంపూర్ణేశ్ బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, జీకే విష్ణు సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మొదట ఈ సినిమాను ఆగస్టు 21న విడుదల చేయాలని భావించినప్పటికీ, నిర్మాణ పనులు ఆలస్యం కావడంతో విడుదల తేదీ సెప్టెంబర్ 25కు మారే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ది ప్యారడైజ్'పై పూర్తి దృష్టి పెట్టిన నాని, ఇతర సినిమాలను తాత్కాలికంగా పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. షూటింగ్ ఆలస్యం కావడం వల్ల ఆయన రెండు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను వదులుకోవాల్సి వచ్చినట్లు సమాచారం. మొదటిది, 'హాయ్ నాన్న' దర్శకుడు శౌర్యువ్ సిద్ధం చేసిన కొత్త సినిమా. కథ నచ్చినా డేట్స్ అందుబాటులో లేకపోవడంతో, ఆ ప్రాజెక్ట్‌ను వేరే హీరోతో ముందుకు తీసుకెళ్లాలని నాని సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ కథ విజయ్ దేవరకొండ వద్దకు వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక రెండోది, 'జై భీమ్' దర్శకుడు టీజే జ్ఞానవేల్ రూపొందించాలనుకున్న చిత్రం. కథపై నానికి మంచి అభిప్రాయం ఉన్నప్పటికీ, డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఈ కాంబినేషన్ కార్యరూపం దాల్చలేదని తెలుస్తోంది. ప్రస్తుతం జ్ఞానవేల్ హీరో సూర్యతో తన తదుపరి చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'ది ప్యారడైజ్' పూర్తయిన తర్వాత దర్శకుడు సుజీత్‌తో కలిసి 'బ్లడీ రోమియో' అనే సినిమా చేయాలని నాని భావిస్తున్నట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. అయితే సుజీత్ ప్రస్తుతం పవన్ కళ్యాణ్‌తో 'ఓజీ-2' ప్రాజెక్ట్‌పైనా దృష్టి పెట్టడంతో, నాని-సుజీత్ సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుందన్నది ఆసక్తికరంగా మారింది.నిర్మాతపై అదనపు ఆర్థిక భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతో నాని తన తదుపరి కమిట్‌మెంట్లను వాయిదా వేసి, 'ది ప్యారడైజ్'ను పూర్తి చేయడంపైనే పూర్తి దృష్టి సారించినట్లు సమాచారం.



# నా లైఫ్ పార్ట్‌నర్ సెన్సిబుల్‌గా ఉండాలి

### నటి శ్రీలీల మనోగతం

టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ అండ్ ఎనర్జిటిక్ బ్యూటీ శ్రీలీల పెళ్లి, రిలేషన్‌షిప్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న బ్యూటీ.. తనకు కాబోయే వాడు ఎలా ఉండాలి? తన లైఫ్ పార్ట్‌నర్‌లో ఎలాంటి క్వాలిటీస్ వెతుకుతుంది? అనే విషయాలపై తాజాగా క్లారిటీ ఇచ్చింది. ఒక ఇంటర్వ్యూలో శ్రీలీలను రిలేషన్‌షిప్ గురించి అడగగా, తన మనసులోని మాటను పంచుకుంది. తనకు కాబోయే వాడు ముఖ్యంగా మూడు లక్షణాలు కలిగి ఉండాలని స్పష్టం చేసింది. 'నాకు లైఫ్ పార్ట్‌నర్‌గా వచ్చే వ్యక్తి చాలా సెన్సిబుల్‌గా ఉండాలి. అలాగే ఇతరుల భావాలను గౌరవించే సెన్సిటివ్ మనస్తత్వం ఉండాలి. వీటన్నింటితో పాటు మోస్ట్ ఇంపా÷-టగ్గ÷ంట్ క్వాలిటీ.. అతనికి మంచి సెన్స్ ఆఫ్ హ్యూమర్ కచ్చితంగా ఉండాలి' అని శ్రీలీల పేర్కొంది. కేవలం లుక్స్ మాత్రమే కాకుండా, వ్యక్తిత్వానికి, ఎదుటివారిని అర్థం చేసుకునే గుణానికే తాను మొదటి ప్రాధాన్యత ఇస్తానని ఈ బ్యూటీ హింట్ ఇచ్చేసింది. ప్రస్తుతం శ్రీలీల చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గ్లామర్, యాక్టింగ్, అదిరిపోయే డాన్స్‌లతో కుర్రకారు మనసు దోచుకున్న ఈ ముద్దుగుమ్మ.. రిలేషన్‌షిప్ విషయంలో ఇంత క్లారిటీగా ఉండటంపై ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. శ్రీలీల చెప్పిన క్వాలిటీస్ విన్నాక.. 'బాస్.. ఆ క్వాలిటీస్ మనలో ఉన్నాయో లేదో ఒకసారి చెక్ చేసుకోవాల్సిందే' అంటూ నెటిజన్లు, అబ్బాయిలు సోషల్ మీడియాలో సరదా కామెంట్స్ పెడుతున్నారు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com